www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం
శుక్రవారం 20-09-2024 | విజయవాడ ప్రచురణ | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 73, సంచిక : 90 పేజీలు : 6+8, వెల: రూ.5.00

ఇది మంచి ప్రభుత్వం

సత్యమేవ జయతే

సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి,
మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రజల చేత అనిపించుకుంటోంది కూటమి ప్రభుత్వం

అవ్వాతాతలకు పింఛన్
రూ.4000 అయ్యింది
దివ్యాంగులకు
రూ.6000 ఇస్తున్నారు

అమ్మలాగా లక్షల మందికి
ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్



నిరుద్యోగ యువత భవిష్యత్తుపై
వెలుగు సంతకం మెగా డీఎస్సీ

కష్టాల్లో ఆప్తుడిలా తోడు నిలిచాడు
వరదపై విజయం సాధించేలా చేసాడు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో
ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా

రైతుబిడ్డకే తెలుసు రైతు కష్టం
రూ.1674 కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపు

ఇది మంచి ప్రభుత్వం

జారీ చేసినవారు: డైరెక్టర్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

ఇక మీదట కూడా ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు అనుగుణంగా
కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చంద్రబాబుగారు హామీ ఇస్తున్నారు

కార్మికుల పోరాటాన్ని అపహాస్యం చేయొద్దు

విశాఖ ఉక్కు పరిరక్షణపై దృష్టి
జేవీఎస్ డిమాండ్

విశాలాంధ్ర- విశాఖ: ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటాన్ని పరిహాసం చేసేలా జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి (జేవీఎస్) ఖండించారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు పరిరక్షణపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని... గతంలో ఇచ్చిన హామీపై పవన్ కల్యాణ్ దృష్టి పెట్టాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కనీసం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం లేదా సొంత ముడి ఇనుము గనులు కేటాయించేలా ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు. ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ఐదు సంవత్సరాలుగా కార్మికులు ఐక్యంగా పోరాటం చేస్తున్నారని, కార్మిక సంఘాలపై అనుచిత వ్యాఖ్యలు తగదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు ఇష్టం లేదని అన్నారు. ఏదో రకంగా ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. సహాయ నిరాకరణ చేస్తూ ప్లాంట్ కుదేలయ్యేలా చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో అన్ని రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుపై కేంద్రంలో మోదీని పవన్ నిలదీయగలరా అని ప్రశ్నించారు. కార్మిక సంఘాలపై నెపం వేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ మూసివేతకు కుట్ర
జీవీఎంసీ ఎదుట వామపక్ష కార్పొరేటర్ల నిరసన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వం ఆదుకోవాలంటూ గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద వామపక్ష నేతలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సెయిల్‌లో విలీనం చేయాలని, ఈ అంశంపై సీఎం, ఉప ముఖ్యమంత్రి... కేంద్ర ఉక్కుశాఖ మంత్రిని అఖిలపక్ష కార్పొరేటర్లు కలిసేలా తీర్మానం కౌన్సిల్‌లో అజెండాగా పెట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, సీపీఎం ఫ్లోర్ లీడర్ బీ గంగారావు మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ తీవ్ర సంక్షోభ స్థితికి నెట్టబడిందని,రేపో మాపో మూసివేత దిశగా సాగుతుందన్నారు. మూడింటిలో రెండుబ్లాస్ట్ ఫర్నేస్‌లు మూసివేశారన్నారు. రోజుకు 21 వేల టన్నులు స్టీల్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా, నేడు నాలుగు వేల టన్నులకి కుట్రతో దిగజార్చారన్నారు. ఈ నెల 24 న జరిగే మహా విశాఖ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో విశాఖ స్టీల్ ను సెయిల్‌లో విలీనం చేయాలని, తక్షణం రూ.ఐదు వేల కోట్లు వర్కింగ్ కేపిటల్ మంజూరు, అప్పులపై ఐదేళ్ల మారిటోరియం విధించాలని అజెండాగా పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తాము మేయర్‌ను కలిసి దీనిని కౌన్సిల్లో ఏజెండాగా పెట్టాలని రాతపూర్వకంగా ప్రతిపాదన చేసినట్లు వివరించారు. టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీల ఫ్లోర్ లీడర్లకు కూడా తమ ప్రతిపాదనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ కౌన్సిల్ ఏజెండాలో తమ ప్రతిపాదన రాలేదని, కనీసం టేబుల్ అజెండాగానైనా పొందుపర్చాలని డిమాండ్ చేశారు. గేటు వద్ద నేలపై బైఠాయించి గంటసేపు వామపక్ష కార్పొరేటర్లు నిరసన తెలిపారు.

విద్య కాషాయీకరణ సహించం : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: విద్యారంగాన్ని ప్రైవేటీకరించినా, కాషాయీకరించినా సహించేది లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి తేల్చిచెప్పారు. ఉద్యమాలకు వెనుకాడబోమని స్పష్టంచేశారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం ప్రతినిధుల సభ జరిగింది. జాన్సన్ బాబు, శివారెడ్డి మాట్లాడుతూ విద్యా రంగ ప్రైవేటీకరణ, కాషాయీకరణకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని, ఇందుకోసం మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు విద్యార్థి లోకం వెనుకాడదని ఉద్ఘాటించారు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో నుంచి తొలగించే కుట్రలను అడ్డుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలల కోసం కేంద్రంతో చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని, అధ్యాపకుల కొరత తీర్చాలని కోరారు. విజయవాడలో ఇటీవల వర్షాలకు విద్యార్థుల పాఠ్యపుస్తకాల పాడయ్యాయని, వాటి స్థానంలో వారికి కొత్త పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని జాన్సన్‌బాబు, శివారెడ్డి డిమాండ్ చేశారు.

ధన్యజీవి తాపీ ధర్మారావు
సాహిత్య గోష్ఠిలో వక్తల నివాళి

విశాలాంధ్ర-విశాఖ: తన జీవితాన్ని సమాజం కోసం త్యాగం చేసిన ధన్యజీవి అని, రచనలతో సమాజాన్ని చైతన్యం చేసిన నిత్య పరిశీలన శీలి తాపీ ధర్మారావు అని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం అధ్వర్యంలో గురువారం "ఆంధ్రవిశారద" తాపీ ధర్మారావు జయంతిని పురస్కరించుకుని తెలుగు మాధ్యమాల దినోత్సవం సందర్భంగా సాహిత్య గోష్ఠి ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ధర్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజం నిత్యం స్మరించుకోదగ్గ గొప్ప వ్యక్తి తాపీ ధర్మారావు అన్నారు. చేమకూర వెంకట కవి రాసిన విజయవిలాసం కావ్యానికి వ్యాఖ్యానం రాసి ప్రముఖులు చేత ప్రశంసలు అందుకొన్నారన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు సాహిత్య పరిశోధనలో విమర్శలో పరాకాష్టకు చేరుకొన్న మహా మేధావి తాపీ ధర్మారావు అన్నారు. ఆయన 30కి పైగా గ్రంథ రచనలు చేశారని వివరించారు. దేవాలయం పై భూతు బొమ్మలు ఎందుకు, పెళ్లి దాని పుట్టు పూర్వోత్తరాలు , ఇనప కచ్చడాలు, పాతపాళి, కొత్త పాళీ తదితర రచనలు చేసి గిడుగు రామమూర్తి శిష్యుడుగా పరిశోధనలోను, విమర్శలోనూ పేరు పొందారన్నారు. ఆచార్య అరుణ్ కుమార్, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ వెంకటేశ్వరులు , డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్ , డాక్టర్ గిరీశ్‌కుమార్, జి.బాబ్జి, కట్టా సత్య హరీశ్, కె. కుశరాజు, వై.సంతోషి, పరిశోధకులు స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. సీఎం హోదాలో లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు వాడారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రతకు, ప్రతిష్టకు భగం కలిగించేలా ఉన్నాయన్నారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా గురువారం ఆమె ట్వీట్ చేశారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశుడికే మచ్చ తెచ్చేలా ఉన్నాయని షర్మిల పేర్కొన్నారు. మీ ఆరోపణల్లో రాజకీయ కోణం లేకుంటే... సెంటిమెంట్‌పై రాజకీయం చేసే ఉద్దేశ్యమే మీకు లేకుంటే, నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా వాడి ఉంటే, తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేయాలన్నారు. మహాపాపానికి, ఘోర అపచారానికి పాల్పడిన నీచులెవరో తేల్చాలని, మీ వ్యాఖ్యలపై కట్టుబడి ఉండాలని, నిజాలు నిగ్గు తేల్చాలని షర్మిల డిమాండ్ చేశారు.

రైతుల గణనకు సమయం పొడిగించాలి
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతుల గణనకు సమయం పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ గురువారం డిమాండ్ చేశారు. నాన్ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూములు ప్రభుత్వం జారీ చేసిన పట్టాలు కలిగి ఉన్న రైతులు కృష్ణాజిల్లాలో వరద దెబ్బతిన్న ప్రాంతాల్లో ఉన్నారని, వారి గణనకు ప్రభుత్వం అనుమతిచ్చిందని, దానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను మరో రోజు పొడిగించాలని కోరారు. అడంగల్ సమాచారం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా కంప్యూటర్‌కు ఫీడ్ చేయాల్సి ఉంటుందని, ఆ సమాచారం ఈ-పంట బుకింగ్, ఎన్యూమరేషన్ కోసం వ్యవసాయ అధికారికి అందజేస్తామన్నారు. ఈ సైట్ సాయంత్రం ఆరు గంటలకు మూసివేయబడుతుందని, సమయం సరిపోవడం లేదని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ సైట్ గడువును పొడిగించాలని కోరారు.

నెల్లూరులో వైసీపీ డీలా!
టీడీపీకి క్యూకట్టిన కార్పొరేటర్లు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: నెల్లూరులో వైసీపీ కనుమరుగవుతోందనే పరిస్థితి నెలకొంది. నెల్లూరు కార్పొరేషన్‌లోని 54 డివిజన్లలో 43 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నెల్లూరు సిటీ పరిధిలో 23 మంది, రూరల్‌లో 20మంది ఇప్పటికే సైకిల్ ఎక్కారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో గురువారం మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మంత్రి పొంగూరు నారాయణ అధ్వర్యంలో 14మంది వైసీపీ కార్పొరేటర్లతో పాటు కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, వైసీపీ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ టీడీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి మంత్రి నారాయణ సాదరంగా ఆహ్వానించారు. పార్టీ మారిన కార్పొరేటర్లలో సంక్రాంతి అశ్విని (మూడో వార్డు), పి.ప్రత్యూష (నాల్గో వార్డు), రవిచంద్ర (5వ వారు), ఎం.మస్తానమ్మ (6వ వార్డు), కిన్నెర ప్రేమ్‌కుమార్ (10వ వార్డు), గోతం అరుణ (11వ వార్డు), కర్తం ప్రతాప్‌రెడ్డి (14వ వార్డు) జి.వెంకటేశ్వర రెడ్డి (15వ వార్డు), వి.శ్రీకాంత్ రెడ్డి (16వ వార్డు), పొట్లూరు రామకృష్ణ (47వ వార్డు), షేక్ ఇంతియాజ్ (48వ వార్డు), వి.రాజేశ్వరి (49వ వార్డు), కాయల సాహిత్య (51వ వార్డు), షేక్ సఫియా బేగం (54వవార్డు) ఉన్నారు. టీడీపీ శ్రేణుల సమన్వయంతో నెల్లూరు నగరాభివృద్ధికి కృషి చేయాలని కొత్త సభ్యులకు మంత్రి నారాయణ సూచించారు. ఈ చేరికలకు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ కీలకంగా వ్యవహరించారు. వైసీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే నెల్లూరులో వైసీపీ కనుమరుగవుతుందని కొందరు అంటున్నారు.

వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు
అక్కినేని వనజ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్రంలో ఇటీవల సంభవించిన భారీవర్షాలు,వరదలు వల్ల నిరాశ్రయులైన, తీవ్రంగా నష్టపోయిన లక్షలాది కుటుంబాలను ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి విత్తులు తలెత్తకుండా వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఎంసీపీఐ (యు) రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో వరద శాశ్వత పరిష్కారాలు-ముంపు నివారణ చర్యలు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన అక్కినేని వనజ మాట్లాడుతూ... ఏటా వర్షా కాలంలో ప్రకృతివిపత్తులతో రైతాంగం, ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఒక శాస్త్రీయ విధానం లేకపోవటం వల్ల నష్టం తీవ్రస్థాయిలో జరుగుతోందన్నారు. కొన్నేళ్లుగా అనేక నీటి ప్రాజెక్టులు, రెగ్యులేటర్, ఎత్తిపోతల పథకాలకు కనీస నిర్వహణ కూడా లేదన్నారు. దీంతో అనేక ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని చెప్పారు. విపత్తులు వచ్చినప్పుడు హడావుడి చేయడం కాకుండా... నష్ట నివారణకు శాశ్వత చర్యలు చేపట్టడం ముఖ్యమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు ఇంకా చూస్తామని... ఇప్పటికైనా ప్రభుత్వాలు చాలా సీరియస్‌గా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇంత పెద్ద విపత్తు సంభవించినా కూడా కేంద్రం ఇంతవరకు సాయమందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రపై ఒత్తిడి చేసి వరద సాయం త్వరితగతిన అందేలా చూడాలన్నారు. నీటిపారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1956లో బుడమేరుపై వెలగలేరు దగ్గర నిర్మించిన రెగ్యులేటర్...దీనావస్థలో ఉందన్నారు. తక్షణం పునర్నిర్మాణం చెయ్యాలని సూచించారు. ఇటీవల వచ్చిన వరదలకు రెగ్యులేటర్ మొత్తం అన్నమయ్య ప్రాజెక్టులాగా కొట్టుకుపోయి ఉంటే విజయవాడ పరిస్థితి మరింత దారుణంగా ఉండేదన్నారు. రాష్ట్రప్రభుత్వం వరద నష్టం అంచనా దాదాపు రూ.7 వేల కోట్లుగా కేంద్రానికి నివేదిక ఇచ్చిందని దానికి మూడింతలు నష్టం జరిగినట్టుగా తాము భావిస్తున్నామన్నారు. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి... కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎంసీపీఐ(యు)రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రంలో వరదలు, అకాల వర్షాలు వల్ల ప్రజల జీనవస్థితిగతులు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయన్నారు.ముఖ్యమంత్రి ఆ సమయంలో చేసిన సేవలను హర్షణీయమన్నారు. అయితే అధికార యంత్రాంగం వైఫల్యం కారణంగా బాధితులందరికీ పూర్తిస్థాయిలో సాయం అందలేదని తెలిపారు. ప్రాజెక్టులు,రిజర్వాయర్ల నిర్వహణలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఏఐసీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.ఖాదర్ బాషా మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం అందిస్తామని చెబుతున్న నష్ట పరిహారం మరింత పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జమలయ్య, సయ్యద్ సలీం, ఆర్.కల్యాణ కృష్ణ,కె.శ్రీధర్,అబ్దుల్లా ముషాహేద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత

ఈశ్వరయ్య డిమాండ్
26 నుంచి అక్టోబర్ 2 వరకు శాంతియుత నిరసనలు

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్నికల్లో వలంటీర్లకు న్యాయం చేస్తామని చెప్పిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు వంద రోజులుగా వలంటీర్లను మోసం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి ఈశ్వరయ్య అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక హనుమాన్ పేట దాసరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండు లక్షల అరవై వేలమంది వలంటీర్లకు న్యాయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వలంటీర్లను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజాప్రతినిధులను ఇంటింటికీ వెళ్లమని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో వలంటీర్లు గ్రామాల్లోకి వచ్చే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు గులాబి పువ్వులు ఇవ్వటం, బూట్లు తుడవటం వంటి చర్యలు చేపట్టి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు శాంతియుత నిరసనలు తెలుపుతామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే వీధిపోరాటాలకు దిగుతామన్నారు. తక్షణమే వలంటీర్లకు న్యాయం చేయాలన్నారు. వచ్చే కేబినెట్ సమావేశంలోపు వలంటీర్లకు న్యాయం చేయకుంటే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈశ్వరయ్య హెచ్చరించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు మాట్లాడుతూ కేబినెట్ సమావేశంలో వలంటీర్ల సమస్యపై నిర్ణయం తీసుకోకుండా నైపుణ్య గణన (స్కిల్ సెన్సెక్స్) పేరుతో కాలయాపన చేస్తూ విధుల్లో కొనసాగుతున్న వలంటీర్లను ఆయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండు లక్షల అరవై వేల మంది వలంటీర్లకు త్వరితగతిన న్యాయం చేస్తూ విధివిధానాలు ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని, రాజీనామా చేసిన వారిని కూడా విధుల్లోకి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు గాంధేయ మార్గంలో శాంతియుతంగా వినూత్న రీతిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లంక గోవిందరాజులు, రాష్ట్ర అధ్యక్షులు ఎం జగదీశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ రమణ నాయక్, రాష్ట్ర కార్యదర్శి రాజేష్, సరోజిని పాల్గొన్నారు.

ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా హరికృష్ణ రాయల్

ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా గుర్రాల హరికృష్ణ రాయల్‌ను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న విజయవాడలోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో హరికృష్ణ రాయల్‌ను ఎన్నుకోవటం జరిగిందన్నారు. గుర్రాల హరికృష్ణ రాయల్ గతంలో అసోసియేషన్ కడప జిల్లా బద్వేల్ రెవిన్యూ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా, కడప జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడుగా పనిచేసిన అనుభవం ఉందని చెప్పారు. అసోసియేషన్ తరపున వీఆర్ఏలకు అండగా నిలబడి పని చేయాలని కోరారు.

దివ్యాంగులకు ఆర్థిక స్వావలంబన అవసరం
గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: దివ్యాంగులు ఆత్మ గౌరవంతో ఆర్థిక స్వావలంబన సాధించాలని, ఉన్నత స్థానాలను చేరుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. వస్తు ఉత్పత్తుల ప్రదర్శన వేదికలను సద్వినియోగించుకొని మరిన్ని ఆర్థిక ప్రయోజనాలు పొందాలని సూచించారు. విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీ మెరైన్ మైదానంలో 11 రోజుల పాటు జరిగే దివ్య కళామేళాను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్‌తో కలిసి గవర్నర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 'దివ్యాంగుల ప్రతిభ, సృజనాత్మకత, స్థితిస్థాపకతకు ఈ మేళా నిదర్శనమం. మేళాలు సవాళ్లతో కూడుకున్నవే అయినా దేశ సామాజిక, ఆర్థిక ఉన్నతికి ప్రతీకగా నిలుస్తాయి' అని అన్నారు. నేషనల్ దివ్యాంగజన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వివిధ కార్యక్రమాల ద్వారా దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు వారి కళాత్మక, వ్యవస్థాపక నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ.. సాధికారత కల్పిస్తోందన్నారు. 20 రాష్ట్రాల నుంచి 100 మందికిపైగా దివ్యాంగ కళాకారులు ఈ మేళాలో పాల్గొంటున్నారని తెలిపారు. ఇది హస్తకళల ప్రదర్శన మాత్రమే కాదు, విభిన్న సాంస్కృతిక వారసత్వ వేడుక అని గవర్నర్ అన్నారు. ఈ మేళా రాబోయే రోజుల్లో అనేక కొత్త అవకాశాలు, గొప్ప విజయాలను చేకూరుస్తుందన్న నమ్మకం తనకున్నదని చెప్పారు. నిర్వాహకుల కృషిని గవర్నర్ అభినందించారు.

ఎన్‌డీఏది సంక్షేమ పాలన: పురందేశ్వరి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: సంక్షేమం, దేశాభివృద్ధి దిశగా ఎన్‌డీఏ పాలన సాగుతోందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో 100 రోజుల పాలనను పూర్తి చేసుకోన్న సందర్భంగా ఆమె గురువారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో విలేకురులతో మాట్లాడుతూ కేంద్ర పథకాలను ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానాలు అంటూ గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడితే... కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతికి కేంద్రం నిధులు కేటాయించిందని పురందేశ్వరి చెప్పారు. ఉక్కు పరిశ్రమను లాభాల్లోకి తెస్తామని, త్వరలోనే రైల్వే జోన్ ఏర్పాటవుతుందని అన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి కేంద్రం సహకరిస్తోందనిచెప్పారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆధునీకరణకు రు.280 కోట్లు డీపీఆర్ కేంద్రానికి పంపినట్లు తెలిపారు. ఈస్ట్ రైల్వే స్టేషన్... పురస్కారాలకల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. రాజమండ్రి నుంచి ఢిల్లీ, అయోధ్య, జైపూర్ నగరాలకు విమానాలు నడపడానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. విమానాశ్రయ కొత్త టెర్మినల్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వరద బాధితులను ప్యాకేజి ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుందని పురందేశ్వరి తెలిపారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయం
నవంబరు 27 నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ నిత్యం పనిచేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీ కామేశ్వరరావు అన్నారు. విద్యల నగరంగా పేరొందిన విజయనగరంలో స్వతంత్ర సంగ్రామంలో ఉజ్వల చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు నవంబరు 27 నుంచి 30 వరకు జరుపుకోవడం విశేషం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. విద్య మనిషి జ్ఞానాన్ని పెంపొందిస్తుందని, సమాజంలో అసమానతలు, అన్యాయాలు, దోపిడీలను ఎదిరించడంతోపాటు సామాజిక రుగ్మతలపై పోరాడడం ద్వారా ఒక నూతన సమాజాన్ని ఆవిష్కరించేందుకు ఏఐఎస్ఎఫ్ కృషి చేస్తుందన్నారు. మహాకవి గురజాడ, శ్రీశ్రీ, నారాయణ బాబు, చాసో వంటి సాహితీ వేత్తలకు నిలయమైన విజయనగరంలో మహాసభలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం మాట్లాడుతూ విద్యా వ్యతిరేక విధానాల పైన పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని , ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో సమస్యలు పరిష్కారం చేయాలని అనేక పోరాటాల్లో ఏఐఎస్ఎఫ్ ముందు ఉందని పేర్కొన్నారు. నియోజక వర్గ కార్యదర్శి డి.అప్పలరాజు, మండల కార్యద్శి కె.భీముడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.అప్పారావు, మండల సహాయ కార్యదర్శులు ఎస్.శ్రీను, డి.రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి. గౌరీ శంకర్ , ఉపాధ్యక్షుడు బి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో వందల కోట్ల ప్రజాధనం లూటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వంలో ప్రజాపాలనే లేదని, జగన్‌మోహన్ రెడ్డి వందల కోట్ల ప్రజాధనాన్ని సొంత పత్రిక సాక్షికి దోచిపెట్టారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. జగన్‌ది దోపిడీ రాజ్యమని విమర్శించారు. పుట్టలోంచి పాములు బయటకు వచ్చినట్టుగా మోసాలు బయట పడుతున్నాయన్నారు. వాలంటీర్లను మధ్యపెట్టి నాటకాలు ఆడారని, మోసపూరిత మాటలు, తప్పుడు ప్రచారాలతో వారి జీవితాలను ఆగమ్యగోచరం చేశారన్నారు. 'సలహాదారుల పదవులుగా ముగుస్తాయని రెన్యువల్ చేశావు కానీ స్వచ్ఛంద సేవ చేసే వాలంటీర్లను ఎందుకు గాలికి వదిలేశావు? నీవు కన్నాలేసే సలహాదారులను నియమిస్తే... మేము ఇరిగేషన్ గేట్ల నిర్మాణానికి సలహాలిచ్చే కన్నయ్య లాంటి వారిని నియమించాం. గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోతే మాట్లాడలేదేమి? ఆ పనులకు లేని డబ్బు... సాక్షి పత్రికకు ఇవ్వడానికి ఎలా వచ్చింది?' అని జగన్‌ను మంత్రి ప్రశ్నించారు. ప్రకటనల కోసం సాక్షి పత్రికకు రూ.440 కోట్లు, మిగతా వాటికి రూ.400 కోట్లు ఇచ్చారంటే పక్షపాతమెంతుందో అర్థమవుతోందని విమర్శించారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆరంభంలోనే చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకతను మూటగట్టుకుందని, ప్రజలదే అంతిమ నిర్ణయమని ఎంపీ వి.విజయసాయిరెడ్డి తెలిపారు. 100 రోజుల్లో వెయ్యి అడుగులు వేస్తామన్న ప్రభుత్వం... బడుగు, బలహీన వర్గాల మనస్సు గాయపర్చిందన్నారు. ప్రభుత్వ పాలనతో రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, తీవ్ర అసంతృప్తి చెందారా, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో ఎందుకు పూర్తి వైఫల్యం చెందిందని ప్రశ్నించారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీగా స్వయం ప్రకటిత చంద్రబాబుకు ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల్లో కులప్రాతిపదికే ప్రామాణికంగా జరిగాయన్న విమర్శలు ఎందుకు వచ్చాయన్నారు. అసంతృప్తితో రగిలిపోతున్న కూటమి నేతలను పట్టించుకోవడం లేదని, విపత్తు నిర్వహణలో పూర్తి వైఫల్యం అనిపించుకున్న చంద్రబాబు స్ట్రైక్ రేట్ ఎంత అని విజయసాయిరెడ్డి ట్వీట్ ద్వారా ప్రశ్నించారు.

శుక్రవారం
20-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 90
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఐరాసలో పలస్తీనా తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరం

జెనీవా: పలస్తీనా నుంచి ఇజ్రాయిల్ దళాల ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ ఐరాస తీర్మానంపై ఓటింగ్‌లో భారత్ పాల్గొనలేదు. 193 మంది సభ్యులు ఉన్న ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానానికి 124 అనుకూల, 14 వ్యతిరేక ఓట్లు రాగా భారత్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, ఇటలీ, నేపాల్, ఉక్రెయిన్, బ్రిటన్ సహా 43 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. ఏడాదిగా పలస్తీనా భూభాగంలో కొనసాగిస్తున్న దురాక్రమణను తక్షణమే నిలుపదల చేసి, ఆ ప్రాంతం నుంచి ఇజ్రాయిల్ నిష్క్రమించేలా ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించింది.

37 వేల తీర్పులు హిందీలోకి అనువాదం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సుప్రీంకోర్టు వెలువరించిన దాదాపు 37 వేల తీర్పులను ఇప్పటి వరకు హిందీలోకి అనువదించినట్లు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తాజాగా వెల్లడించారు. వివిధ భారతీయ భాషల్లోకి తీర్పులను అనువదించే ప్రక్రియ కొసాగుతోం దని తెలిపారు. సుప్రీం ఇప్పటి వరకు ఇచ్చిన తీర్పులను ఎక్కువగా హిందీలోకి అనువదించగా... ఆ తర్వాతి స్థానంలో తమిళం ఉన్నట్లు వెల్లడించారు. ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ విషయం వెల్లడించింది. రాజ్యాంగం గుర్తించిన ప్రాంతీయ భాషల్లోకి

- మిగతా 5 లో

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

- మూడేళ్లలో 28 లక్షల కుళాయి కనెక్షన్లు
- అన్ని గ్రామాలకు నిరంతర నీటి సరఫరా
- 'జల్‌జీవన్ మిషన్' సమీక్షలో చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాబోయే మూడేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీటిని అందించాలి... ఇందుకు అనుగుణంగా పనుల్లో పురోగతి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నిరంతరాయంగా ఇంటింటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో గ్రామీణ నీటి సరఫరా, జల్ జీవన్ మిషన్ పథకాలపై గురువారం సీఎం సమీక్ష చేశారు. మొత్తం 26 జిల్లాల్లో 95.44 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్ ద్వారా నీటిని అందించాల్సి ఉండగా, ఇందులో 2019 ఆగస్టుకు ముందే 31.68 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం 39.30 లక్షల కనెక్షన్లు మాత్రమే ఏర్పాటు చేయగలిగిందన్నారు. సకాలంలో మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వనందువల్ల కేవలం 5 జిల్లాల్లో మాత్రమే 90 శాతానికి పైగా ట్యాప్ కనెక్షన్లు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షిత నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో ఎన్డీయే ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో పాటు నిధులు తీసుకురావడంలో కూడా ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన రూ.27,248 కోట్లలో వైసీపీ ప్రభుత్వం రూ.4235 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఇంకా 28 లక్షల ఇళ్లకు ట్యాప్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళతో పాటు

- మిగతా 5 లో

24X7 ఇసుక బుకింగ్

నూతన పోర్టల్ ప్రారంభించిన సీఎం

ఉచితంగా ఇసుక ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని, ఇకపై 24గంటలు బుకింగ్ చేసుకోవచ్చు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

5లో

వైసీపీకి భారీ షాక్

జనసేనలోకి బాలినేని, సామినేని... 22న ముహూర్తం

పవన్ కల్యాణ్‌తో భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ నేతలు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారు. ఇద్దరు కీలక నేతలు జనసేనలోకి వెళ్లేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేయగా... ఆయనకు మరో సీనియర్ నేత సామినేని ఉదయభాను తోడయ్యారు. గురువారం మంగళగిరి జనసేన కార్యాలయంలో ఒకరి తర్వాత ఒకరు పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. జనసేనలో చేరిక విషయంపై స్పష్టత ఇచ్చారు. కాగా పవన్ కల్యాణ్‌ను వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కలవడం వైసీపీకి భారీ షాక్‌గా మారింది. ఈనెల 22న జనసేనలో చేరుతున్నట్లు ఆయన వెల్లడించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఉదయభాను పార్టీలో కీలకంగా

- మిగతా 5 లో

ఏపీకి మళ్లీ తుపాను

24న బంగాళాఖాతంలో అల్పపీడనం
ఉత్తరాంధ్ర, కోస్తాకు భారీ వర్ష సూచన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రానికి మళ్లీ తుపాన్ ముప్పు పొంచి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కృష్ణానదికి రికార్డుస్థాయిలో వచ్చిన వరద... ఉప్పొంగిన బుడమేరు ప్రవాహ ధాటికి విజయవాడ నగరం ఇప్పట్లో కోలుకోలేని విధంగా దెబ్బతింది. కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలు కూడా భారీ వర్షాలకు అతలాకుతలమయ్యాయి. లక్షల ఎకరాల పంట నాశనమైంది. ఇప్పుడిప్పుడే ఈ వరద ప్రభావం నుంచి బయటపడడానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో మళ్లీ వాతావరణశాఖ మరో తుపాన్ ఉన్నట్లు హెచ్చరించడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉత్తర, మధ్య బంగాళాఖాతం పరిసరాలలో ఈనెల 24వ తేదీన అల్పపీడనం

- మిగతా 5 లో

సందీప్ ఘోష్ మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దు

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా హత్యాచార ఘటనలో ఆర్జీ కర్ వైద్యకళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. తాజాగా ఆయన మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దయింది. పశ్చిమ బెంగాల్ మెడికల్ కౌన్సిల్ గురువారం ఆయన రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసింది. డబ్ల్యూబీఎంసీ నిర్వహిస్తోన్న రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ జాబితా నుంచి ఘోష్ పేరును తొలగించిందని సంబంధిత అధికారి మీడియాకు వెల్లడించారు. ఘోష్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బెంగాల్ విభాగం ఇటీవల డబ్ల్యూబీఎంసీని కోరింది.

రేవంత్‌తో సీపీఐ నేతలు
రామకృష్ణ, కూనంనేని భేటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ గురువారం హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తుఫాను సహాయక చర్యలను అభినందించారు. రామకృష్ణ వెంట సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉన్నారు.

భారత్ అంతర్గత విషయాల్లో
జోక్యం తగదు

పాక్ మంత్రి వ్యాఖ్యలపై రాజా ఆగ్రహం

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370పై కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి వైఖరిని పాకిస్థాన్ రక్షణ మంత్రి సమర్థించడంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా గురువారం తీవ్రంగా స్పందించారు. భారత్ అంతర్గత విషయాల్లో పాకిస్థాన్ రక్షణ మంత్రి తలదూర్చడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌కూ ఇది వర్తిస్తుందని హితవు పలికారు. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ అనంతరం పాకిస్థాన్ ఎందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని డి.రాజా నిలదీశారు. భారత్ అంతర్గత విషయాల్లో పాక్ జోక్యం నివారించాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. జమ్మూ కశ్మీర్ ప్రజలు పరిణితి చెందిన వారని, జమ్మూకశ్మీర్‌కు, దాని భవిష్యత్‌కు ఏమి చేయాలనేది వారికి స్పష్టంగా తెలుసునని వ్యాఖ్యానించారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా పాకిస్థాన్ భాష మాట్లాడుతున్నారని, పాక్ కనుసన్నల్లో నడుస్తున్నారని బీజేపీ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ ఆరోపించారు. అదేసమయంలో ఆర్టికల్ 370పై కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ వైఖరిని పాకిస్థాన్ రక్షణ మంత్రి సమర్థించడం పట్ల ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. పాకిస్థాన్ ఏం చెప్పిందనేది తనకు తెలియదని వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపూర్‌లో ఆయన గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తాను పాకిస్థానీ కాదని, భారత పౌరుడినని అన్నారు.

బెజవాడలోనే
70 ఎకరాల ఆక్రమణ

ఆపరేషన్ బుడమేరు షురూ: మంత్రి నిమ్మల

- 3 వేల నిర్మాణాలున్నట్లు గుర్తింపు
- ఆక్రమణల తొలగింపునకు అధికారులు సిద్ధం
- సీఎం ఓకే అనగానే పనులు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గతంలో ఎన్నడూలేని విధంగా దాదాపు పది రోజులపాటు విజయవాడ నగర ప్రజలకు నరకం చూపించిన బుడమేరు వరద ముప్పు నుంచి శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుడమేరు వరద ప్రవాహ ప్రదేశం ఆక్రమణకు గురి కావడమే భారీ నష్టానికి ప్రధాన కారణంగా భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ బుడమేరు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా జలవనరులశాఖ, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, సర్వే అధికారులతో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విజయవాడ క్యాంపు కార్యాలయంలో మూడు రోజులుగా సమీక్ష నిర్వహిస్తున్నారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుండి పాత ఛానల్, విజయవాడ నగరం, గుడివాడ నుండి కొల్లేరు మీదుగా బుడమేరు వెళుతుంది. వెలగలేరు, కవులూరు, ఈలప్రోలు, పైదూరుపాడు, గొల్లపూడి మీద నుండి విద్యాధరపురం, విజయవాడలోని 14,15,16 వార్డులకు సంబంధించి గుణదల, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు వరకు మొత్తంగా 13.25 కిలోమీటర్ల వరకు బుడమేరు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఇందులో ఎక్కువ వ్యవసాయ ఆక్రమణలున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యాధర పురం నుండి గుణదల వరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే 202 ఎకరాలకుగాను 70 ఎకరాలు ఆక్రమణకు గురి కాగా, వీటిలో 3051 ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ బుడమేరు విస్తరణ ఎంత, ఇందులో ఆక్రమణలు ఎంత అయ్యాయో గుర్తించామని తెలిపారు. ప్రతి పదేళ్లకు ఒకసారి వరదలతో ముంచెత్తుతూ బెజవాడ దుఃఖదాయనిగా గుర్తింపు పొందిన బుడమేరుకు భవిష్యత్‌లో ఆ పేరు లేకుండా, విజయవాడను ముంపు రహిత నగరంగా మార్చేలా చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యం మేరకు త్వరలో ప్రక్షాళన పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. చీమలవాగు, కేసరపల్లి, ఎనికేపాడు, యూటీల సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందని, ఎనికేపాడు నుండి కొల్లేరు వరకు వెళ్లే 50.6 కిలో మీటర్ల కాలువ గట్లను మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. ఈ గట్టును ఎంత మేర, ఎక్కడెక్కడ బలోపేతం చేయాలి? లైనింగ్, విస్తరణ పనులు ఎంత మేర చేయాలో సమీక్షించామని తెలిపారు. బుడమేరు పాత ఛానెల్ అంతా నగరంలోని ఇళ్ల మధ్య నుండి ప్రవహిస్తున్నదున... దీనికి సమాంతరంగా వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుండి పాముల కాలువ, ముస్తాబాద్ కెనాల్ మీదుగా ఎనికేపాడు కెనాల్‌ను విస్తరణ చేయడం ద్వారా బుడమేరుకు వచ్చే వరద నీటిని మళ్లించే అవకాశం ఉంటుందన్నారు. అందుచేత పాముల కాలువ, ముస్తాబాద్ కాలువలు ఇరిగేషన్‌పరంగా ఎంత వరకు విస్తరణ చేయవచ్చో పరిశీలించి... ఈ

- మిగతా 5 లో

రేపు ఢిల్లీ సీఎంగా ఆతిశీ ప్రమాణం

ఐదుగురు మంత్రులు కూడా...

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆతిశీ ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేయనున్నారు. సీఎంతో కలిపి ఐదుగురు నేతలు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. ఇందులో గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లోత్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్ కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేయబోతున్నారు. ఈసారి కొత్తగా

- మిగతా 5 లో

'జమిలి' ఆచరణ సాధ్యమేనా?

- ఎన్డీఏ ప్రభుత్వం ఎదుట అనేక సవాళ్లు
- 6 రాజ్యాంగ సవరణలు అవసరం
- లోక్‌సభ, రాజ్యసభలో సరిపోని సంఖ్యాబలం
- ఇప్పటికే వ్యతిరేకిస్తున్న విపక్షాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన క్రమంలో దేశంలో జమిలి ఎన్నికలపై రాజకీయవేడి రాజుకుంది. అనుకూల, ప్రతికూల వాదనలు ఎలా ఉన్నా దీనిని ఆచరణలో పెట్టడం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి అంత సులువేమీ కాదు. దేశవ్యాప్తంగా ఒకేసారి పార్లమెంటుతో పాటు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలంటే సుమారు 6 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం అందుకు సగం రాష్ట్రాల ఆమోదం కావాలి. ప్రస్తుతం లోక్ సభ, రాజ్యసభల్లో ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న సొంత బలం సరిపోదు. జమిలి కోసం అదనపు ఎంపీల మద్దతు కూడగట్టాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఇప్పటికే ఇండియా ఐక్యసంఘటన ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో జమిలి ఎన్నికల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఇక జమిలి అంటే పార్లమెంటుతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఏకకాలంలో ఎన్నికలు జరిపించాలి. నిజానికి 1951 నుంచి 1967 దాకా దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరిగాయి. తర్వాత వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలడం వల్ల మధ్యంతర ఎన్నికలొచ్చి జమిలి మాయమై ఆయా రాష్ట్రాల అసెంబ్లీల గడువులు మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వీటన్నింటినీ రానున్న సార్వత్రిక ఎన్నికలతో కలపాలంటే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువును పెంచడమో, మరికొన్నింటిని తగ్గించడమో చేయాలి. లోక్‌సభ ముందస్తు ఎన్నికలకు వెళ్లినా ఈ మార్పులు తప్పవు. ఇందుకు రాజ్యాంగ పరంగా అవరోధాలున్నాయి. దేశంలో వివిధ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు, మార్గదర్శకాలకు ఉద్దేశించిన 1951 ప్రజాప్రాతినిధ్య

- మిగతా 5 లో

ఇదీ లోకం!

సంపాదకీయం

విషమిస్తున్న విద్వేషం

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల మూడు రోజులపాటు అమెరికా పర్యటనకు వెళ్లక ముందు నుంచే అక్కడ ఆయన మోదీ మీద ఎన్ని విమర్శలు చేస్తారోనన్న ఊహాగానాలు మొదలైనాయి. అనుకున్నట్టుగానే గత సోమవారం వర్జీనీయాలో భారత సంతతి వారిని ఉద్దేశిస్తూ రాహుల్ అన్న మాటలు పెద్ద వివాదానికి దారి తీశాయి. భారత్‌లో ఏ మతం వారు... వారి మతాన్ని అనుసరించే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఈ విషయం స్పష్టం చేయడానికి ఆయన ఆ సభకు హాజరైన ఒక సిక్కును పేరు అడిగి భారత్‌లో మీరు స్వేచ్ఛగా మీ మతాన్ని అనుసరించే పరిస్థితి లేదు. మీరు పగిడీ కట్టుకోవడం, చేతికి కడా ధరించడం కూడా దుర్లభం అయ్యే పరిస్థితి ఉంది అన్నారు. గురుద్వారాకు వెళ్లే అవకాశమూ లేదు అన్నారు. రాహుల్ అన్న మాటలో అతిశయోక్తి ఉంటే ఉండొచ్చు. బహిరంగంగా మాట్లాడేటప్పుడు ఏ పార్టీకి చెందిన వారైనా జనాన్ని ఆకట్టుకోవడానికి ఇలాంటి శైలి అనుసరించడం మామూలే. దీన్ని బీజేపీ చాలా తీవ్రంగా పరిగణించింది. రాహుల్ గాంధీ ఇటీవల పార్లమెంటు లోపల, బయట చేస్తున్న విమర్శలను బీజేపీ నాయకులు ఏ మాత్రం భరించలేకపోతున్నారు. అమెరికాలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల మీద రాద్ధాంతం మొదలు పెట్టారు. కేంద్రమంత్రి రవణీత్ సింగ్ బిట్టూ నుంచి మొదలుకొని, రఘురాజ్ సింగ్, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ నోటికి ఏ మాత్రం అదుపులేకుండా చేస్తున్న హెచ్చరికలు రాహుల్ గాంధీ ప్రాణానికి ముప్పు ఉందేమోనన్న అనుమానాలు కలిగిస్తున్నాయి. గైక్వాడ్... రాహుల్ నాలుక కోసిన వారికి రూ.11 లక్షలు బహూకరిస్తారట. బీజేపీ నాయకుడు తర్వీందర్ సింగ్ మార్వా అయితే రాహుల్ గాంధీకి కూడా వాళ్ల నాయనమ్మ ఇందిరా గాంధీకి పట్టిన గతే పడ్తుందని అన్నారు. రవణీత్ సింగ్ బిట్టు అయితే ఏకంగా రాహుల్ గాంధీ భయంకరమైన తీవ్రవాది అన్నారు. బిట్టూ మీద కాంగ్రెస్ కార్యకర్తలు దేశంలోని అనేక చోట్ల కేసులు నమోదు చేశారు. ఇది నిజానికి బీజేపీ నేర్పిన విద్యే. రాహుల్ గాంధీ మీద ఇప్పటికే పరువు నష్టం కేసులతో సహా అనేక రాష్ట్రాలలో బీజేపీ కేసులు దాఖలు చేసింది. గుజరాత్‌కు చెందిన దళిత నాయకుడు జిగ్నేశ్ మేవానీ మీద ఇలాగే అసోంలో కేసు దాఖలు చేస్తే... అసోం పోలీసులు హుటాహుటిన విమానాలు ఎక్కేసి గుజరాత్‌లో ఉన్న జిగ్నేశ్ మేవానీని అరెస్టు చేసి అసోం తీసుకెళ్లారు. ఆ వ్యవహారం ఇప్పటికీ తేలనే లేదు. రాహుల్ గాంధీ సిక్కులను ఉదాహరణగా చూపి మన దేశంలో మత స్వేచ్ఛకు బీజేపీ హయాంలో ఎలా విఘాతం కలుగుతోందో చెప్పే ప్రయత్నం చేశారు. కానీ సిక్కులను ఒక్క మాట కూడా అనలేదు. అయినా గుడ్డిగా ఆయన సిక్కులను అవమానించారని వక్రీకరించడానికి బీజేపీ వెనుకాడడం లేదు. ఒక బీజేపీ ఎమ్మెల్యే అయితే రాహుల్ గాంధీని హతమారుస్తామన్న దాకా వెళ్లారు. శాసనసభ్యులు, బీజేపీలో తగు మాత్రం పలుకుబడి ఉన్న నాయకులు, కడకు కేంద్ర మంత్రులు కూడా రాహుల్ గాంధీ మీద ఇలా తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం చూస్తే మోదీ ముస్లింల మీద పెంచి పోషించిన విద్వేషం రాహుల్ గాంధీ లాంటి నాయకులను తీవ్రంగా బెదిరించే స్థాయికి చేరుకుంది. కేంద్రమంత్రి రవణీత్ సింగ్ బిట్టు అయితే ఇటీవల బీజేపీ నాయకులు అనడం మానేసిన "పప్పు" అన్న పదాన్ని రాహుల్ మీద ప్రయోగించారు. చాలాకాలం నుంచి మోదీ మొదలుకుని బీజేపీ నాయకులు రాహుల్ ను "పప్పు" అని సంబోధించే వారు. పప్పు అంటే మూర్ఖుడు, పిల్ల చేష్టలు చేసే వాడు అన్న అర్థాలు ఉన్నాయి. అయితే భారత్ జోడో యాత్ర తరవాత రాహుల్‌లో రాజకీయ పరిణతి బాగా పెరిగింది. పార్లమెంటులో ఆయన ప్రసంగాలు దిగ్గంతలైన పార్లమెంటేరియన్లను గుర్తు చేస్తున్నాయి. మోదీని, ఆయన విధానాలను రాహుల్ తూర్పార పట్టడాన్ని బీజేపీ నేతలు భరించలేక పోతున్నారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ ఎప్పుడు ప్రసంగించినా బీజేపీ సభ్యులు నినాదాలు చేస్తూ అడ్డు తగలడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆ సమయంలో ప్రధానమంత్రి మోదీ కానీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గానీ తమ పార్లమెంటు సభ్యులను నియంత్రించే ప్రయత్నమైనా చేయలేదు. అంతే కాకుండా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాహుల్ ప్రసంగంలో ఎక్కుపెట్టిన విమర్శలు మోదీకి శూలాల్లా తగిలాయి. ఆ తీర్మానానికి సమాధానం ఇచ్చేటప్పుడు మోదీని పప్పు అనలేదు కానీ ఆ మాటకు అర్థం వివరణ ఇస్తున్నట్టుగా "బాలక్ బుద్ధి" అన్నారు. మోదీకన్నా ముందే రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యులుగా ఉన్నారు.

కేంద్ర మంత్రితో సహా బీజేపీ రాహుల్ మీద చేస్తున్న నిష్కారణ దాడిని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రికి ఓ లేఖ రాశారు. ఈ లేఖకు సంబంధించి ఖర్గేకు సమాధానం అయితే వచ్చింది. కానీ అది ప్రధానమంత్రి నుంచి కాదు. బీజేపీ అధ్యక్షుడు నడ్డా తగుదునమ్మా అని సమాధానం ఇచ్చి అదనపు ఆరోపణలు గుప్పించారు. నడ్డా ఇచ్చిన సమాధానం కెలికి జగడం పెట్టుకునేదిగా ఉంది తప్ప అత్యంత పెద్ద పార్టీకి అధ్యక్షుడైన వ్యక్తి చూపాల్సిన సంయమనం, మర్యాదా ఖర్గేకు రాసిన లేఖలో లేవు. విధి లేక మీరు రాహుల్‌ను సమర్థిస్తున్నారు అని ఖర్గే మీద కూడా అనుచిత విమర్శలు గుప్పించారు. రాహుల్‌ను జనం ఇప్పటికే అనేక సార్లు తిరస్కరించారు అని కూడా నడ్డా తన మూడు పేజీల లేఖలో రాశారు. కానీ ఈ సారి ప్రజలు బీజేపీని 303 స్థానాల నుంచి 240 స్థానాలకు కుదించిన వాస్తవాన్ని వాటంగా విస్మరించారు. రవణీత్ సింగ్ బిట్టూ మొన్నటిదాకా కాంగ్రెస్‌లో ఉన్నవారే. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. బీజేపీ అగ్రనాయకుల దృష్టిని ఆకర్షించడానికే ఆయన అడ్డూ అదుపు లేకుండా రాహుల్‌ను దూషించడానికి తెగబడ్తున్నారు. బిట్టు చేసిన విమర్శలు కేంద్రమంత్రి స్థాయిని పాతాళానికి చేర్చాయి. రాహుల్‌ను దుయ్యబట్టే క్రమంలో బిట్టూ నిజానికి సిక్కుల మీద విపరీతమైన దాడి చేశారు. "విమానాలను, రైళ్లను, రోడ్లను పేల్చేసే వారు రాహుల్‌కు మద్దతుదార్లు. అత్యంత భీకరమైన తీవ్రవాదిని పట్టుకున్న వారికి బహుమతి ఏదైనా ఉంటే రాహుల్‌ను పట్టుకున్న వారికి ఇవ్వాలి" అన్నారు. సాధారణ నాయకుల నుంచి బిట్టు లాంటి కేంద్ర మంత్రుల దాకా సంస్కార రహితంగా మాట్లాడడానికి కారణం ముస్లింలకు వ్యతిరేకంగా మోదీ ఎక్కించిన విద్వేషం. అది ఇప్పుడు ఎవరికి వ్యతిరేకంగానైనా వాడే ప్రమాదకర స్థాయికి చేరుకుంది. మోదీ తన అనుచరుల అనుచిత ప్రవర్తనను చూసి మందలించకపోవడం అంటే ఈ విద్వేష వమనానికి ఆయన మద్దతూ ఉందనే అనుకోవాలి. విద్వేషం ఈ స్థాయిలో విస్తరింప చేయడం అత్యంత హేయమైన రాజకీయం. మొత్తం సమాజానికి ప్రమాదకరం. ఈ విద్వేష వాతావరణం మారడానికి దశాబ్దాలు పడ్తుంది.

నాకెందుకులే

రా బావ ఏంటి నాకెందుకులే అని గొణుక్కుంటూ వస్తున్నావు. అవునయ్యా నాకుందుకంటా పోనీలే పాపం అన్ని రకాలుగా వరదల్లో నష్టపోయిన వారిలో చాలామంది నోరు తెరిచి అడగలేక మూగనోము పట్టారు. అటువంటి వారికోసం ప్రభుత్వ అధికారులను నిలదీసి ఎటువంటి సాయం అందని వారికోసం అందేలా చేద్దామనుకున్నా కాని నీ కెందుకయ్యా నువు అనవసరంగా జోక్యం చేసుకుంటే కష్టాలపాలవుతావని బెదిరిస్తున్నారు. బెదిరించడమే కాదు ఏదో నేరం మోపి లోపల వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే నాకెందుకులే అనుకుంటూ నీ దగ్గరికొచ్చా. అది సరేనయ్యా ప్రతి వ్యక్తి నాకెందుకులే అనుకుంటే నిండా మునిగి సర్వస్వం కోల్పోయిన ఆ అభాగ్యులను ఆదుకునేదెవరు. ఎవరేంటి ప్రభుత్వమే. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల వచ్చిన ఈ ఉపద్రవం నుంచి కడతేర్చవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. గత పదేళ్ల కిందనే ఇరిగేషన్ శాఖ హెచ్చరించినా పెడచెవిన పెట్టిన ప్రభుత్వాలదే బాధ్యత. పైన హెలికాప్టర్లు తిరుగుతుంటే అందులో నుంచి ఆహార పొట్లాలు వేస్తారేమోనని మోర పైకెత్తి చూస్తే మెడ నొప్పి వచ్చిందే తప్ప ఎటువంటి ఆహారం అందలేదని జక్కంపూడి, అంబాపురం లాంటి గ్రామ వాసులు వాపోతున్నారు. అసలు నాకెందుకులే అనే నిర్వేదం,



నాకేంటి అనే స్వార్థ చింతన మంచిది కాదయ్యా. గతంలో సమాజ సేవే ముఖ్యంగా భావించబట్టి మహనీయుల త్యాగ ఫలితంగా స్వాతంత్ర్యం పొందాం. ఆ తరువాత ఆదరణకు నోచుకోని అభాగ్యులను గుర్తించి వారి ధీనస్థితిని గుర్తించి కమ్యూనిస్టులు రంగంలోకి దిగి యువజన సంఘమని, కార్మిక సంఘమని మహిళా సంఘమని వివిధ రూపాలలో అనేక ప్రజా సంఘాలు నిర్మించి పేదల కోసం ఎంతో కృషి చేశారు. ఆనాడు వారందరూ నాకేంటి అని ఆలోచిస్తే పరిస్థితులలో మార్పు వచ్చేది కాదుకదా. మనం ఈ సమాజంలోనే బతుకుతున్నాం. సమాజానికి ఈ తీరుగ బతకడం లేదు. మన పక్కవాడికి అన్యాయం జరిగితే పట్టించుకోకపోతే మానవ ధర్మం విస్మరించినట్లే. అందరం కల్సి ఏర్పాటు చేసుకున్న సమాజానికి ద్రోహం చేసే చీడపురుగులు ఉంటే వాటిని ఏరి పారవేయవలసిన పని మనదే అనుకోవాలి. నాకేంటి అని వూరుకుంటే సమ సమాజ స్థాపన కోసం అశువులుబాసిన వారికి ద్రోహం చేసినట్లే. మన కోసం మనం నిర్మించుకున్న ఈ సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. సమాజ రుగ్మతులు తొలగించే ప్రయత్నం చేయడం మన అందరి బాధ్యత. అది సరేనయ్యా సమాజాన్ని కాపాడమని మనం ఎన్నుకున్న ప్రభుత్వాలు వాళ్ల పార్టీని పెంచుకుని తద్వారా మరొకసారి అధికారాన్ని నిలుపుకొనే ప్రయత్నాలు తప్ప ప్రజల కడగండ్లు వారికి కనిపించవా! చూసినా నిర్లక్ష్యం వహిస్తున్నారా. సరే ఏదిఏమైనా బుడమేరు ప్రభుత్వాల కళ్లు తెరిపించిందని చెప్పాలి. ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ఒక చెంపపెట్టు లాంటిది. సిద్ధాంతాలు లేని పార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసి పదవులు పొంది సొంతానికి సంపాదించడమే వాటి ధ్యేయం తప్ప ప్రజల కోసం కాదు. ప్రజాస్వామ్యంలో హిట్లరును మించి ప్రవర్తిస్తున్నారు. 1972 లో విశాఖ ఉక్కు మా హక్కు అని ఆంధ్ర యువత గొంతు చించుకుని అరుస్తూ రోడ్డెక్కి అరెస్టులకు, లాఠీదెబ్బలు లెక్కచేయకుండా సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రతి పౌరుడు ఖండించి బజారున పడవలసిన అవసరం ఉంది. అంతేకాదు నూతనంగా గత ప్రభుత్వంలో ఏర్పాటయినప్పుడు మెడికల్ కాలేజీలు కూడా ప్రైవేటుపరం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. అసలు దేశంలో ప్రతి పౌరుడికి కావలసినది, ప్రభుత్వం యివ్వవలసింది విద్య, వైద్యం. ఈ రెండు ఆర్థికపరంగా ఆలోచించకుండా ప్రతి మనిషికి ఉచితంగా ప్రభుత్వం అందిస్తే అంతకంటే చేయవలసింది ఏమీలేదు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా యింతవరకు మన ప్రభుత్వాలు ఆ పని చేయకపోగా వాటిని ప్రైవేటుపరం చేసే ఆలోచన దుర్మార్గం. విద్య, వైద్యం ప్రభుత్వం నుంచి పొందటం ప్రతి పౌరుని ప్రాథమిక హక్కుగా భావించాలి. అప్పుడే అది ప్రజా ప్రభుత్వం అనిపించుకుంటుంది. తామెన్నుకున్న ప్రభుత్వం ద్వారా తమను తామే పాలించుకుంటున్నామన్న భ్రమలు తొలగిపోయి ప్రైవేటు వారి దయపై ఆధారపడవలసి వస్తుందన్న ఊహ ప్రజాస్వామ్యంలో భరించరానిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవో వంకలు చూపి ప్రైవేటు వైపు అడుగులు వేయడం మానుకోవాలి. ఒకపక్క వరదల్లో సర్వం కోల్పోయి చేతిలో చిల్లిగవ్వ లేని సమయంలో వైద్యం కొనుక్కోండి అంటే భరించరాని విషయం. చావుతప్పి బయటపడ్డ బాధితునికి ప్రైవేటుపరం చేస్తామన్న వార్త పుండుపై కారం చల్లినట్లుగా ఉంది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన కూడా ప్రైవేటుపరం చేసేలా ఉంటే మానుకోవాలి. విశాఖ ఉక్కుతో పాటు కొత్త మెడికల్ కాలేజీలను కాపాడుకోవడానికి ఆంధ్ర జాతి ఎంతవరకైనా తెగిస్తుందని, అవసరమయితే ప్రాణ త్యాగానికైనా సిద్ధపడుతుందనే విషయం కేంద్రం గుర్తిస్తే మంచిది. ప్రతి పౌరుడు నాకెందుకులే అని చేతులు ముడుచుకుని కూర్చోడు.

సెల్: 9885569394

కశ్మీర్ ఓటర్ల ఉత్సాహం అంతరార్థం

భరద్వాజ

పదేళ్ల తరవాత జమ్మూ-కశ్మీర్ శాసనసభకు జరిగిన తొలి విడత ఎన్నికలలో 60 శాతం పైగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి రావడం కచ్చితంగా సానుకూల పరిణామం. 2014 తరవాత జమ్మూ-కశ్మీర్‌లో శాసనసభ ఎన్నికలు జరగడం ఇదే మొదటి సారి. ఓటర్లు ఉత్సాహం చూపడం 2019 ఆగస్టు అయిదున జమ్మూ కశ్మీర్‌కు వర్తించే 370వ అధికరణాన్ని మోదీ ప్రభుత్వం రద్దు చేసినందువల్లో, జమ్మూ-కశ్మీర్‌కు ఉన్న రాష్ట్రప్రతిపత్తి లాగేసి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడమో, లడాఖ్‌ను మరో కేంద్ర పాలిత ప్రాంతంగా విడగొట్టినందువల్లో మాత్రం కాదు. మోదీ ప్రభుత్వం అయిదేళ్ల కింద తీసుకున్న చర్యలవల్ల జమ్మూ-కశ్మీర్‌లో తీవ్రవాదం మటుమాయం అయిందన్న సంతోషంలో ప్రజలు తండోపతండాలుగా ఓటు వేయడానికి ఉత్సాహం ప్రదర్శించారనుకోవడమో భ్రమే.

హురియత్ లాంటి సంస్థలు ఈ సారి ఎన్నికలు బహిష్కరించాలని పిలుపు ఇవ్వకపోవడం వల్ల ఓటర్లు పోలింగ్ మీద ఆసక్తి చూపి ఉండవచ్చు. కిందటేడాది 18 ఏళ్లు దాటిన వారికి కొత్తగా ఓటు హక్కు వచ్చినందువల్ల ఆసక్తిగా ఓటు వేసి ఉండొచ్చు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు 58.46 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో ఇది మరి కొంచెం పెరిగి 60 శాతం దాటింది. కోల్పోయిన రాష్ట్ర ప్రతిపత్తి మళ్లీ సాధించుకోవడం, 370వ అధికరణం రద్దు ప్రభావం, తీవ్రవాద దాడులు పెరగడం, అభివృద్ధి కుంటుపడడం లాంటి అంశాలు ప్రజలు ఓటు వేయడానికి ఆసక్తి చూపడానికి కారణం కావొచ్చు. మొదటి సారి ఓటు హక్కు వచ్చిన వారు, గత 34 ఏళ్లుగా వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్ ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇవ్వడంవల్ల ఇదివరకు చాలా మంది ఓటు హక్కు వినియోగించుకునే వారు కాదు. సమస్యాత్మకం అనుకున్న పుల్వామా, అనంత్‌నాగ్, కుల్గం, షోపియాన్ ప్రాంతాలలో కూడా పోలింగ్ శాతం బాగా పెరిగింది. ఒక్క ట్రాల్‌లో మాత్రం 40.58 శాతం ఓట్లే పోలయ్యాయి. 2024లో ఇక్కడ పోలైంది 37.68 శాతమే.

370వ అధికరణం రద్దు, రాష్ట్ర హోదా తొలగింపు వల్ల ప్రజలు చాలా ఇబ్బందులుపడ్డారు. తీవ్రవాదం తగ్గిందని నమ్మించడానికి నిరంతరం భద్రతా దళాల అణచివేత గత అయిదేళ్లుగా కొనసాగింది. కేంద్ర పాలిత ప్రాంతమైనందువల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు కశ్మీరీలను అవమానిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక చట్టాలు హడావుడిగా తీసుకొచ్చింది. ప్రజా ప్రతినిధులు లేనందువల్ల అడిగే నాథుడే లేకుండా పోయాడు. "ఈ నిస్సహాయ స్థితి నుంచి బయట పడడానికే నేను ఓటు వేస్తున్నాను" అని ఒక ఓటరు వ్యాఖ్యానించారు. జమ్మూ-కశ్మీర్ తత్వాన్ని మార్చేసిన వారికి గుణపాఠం చెప్పడం కోసం కూడా చాలా మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో తమ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితిని మార్చడానికి తాము ఓటు వేశామని చాలా మంది చెప్పారు. దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ ఇప్పటికీ అల్లకల్లోలంగానే ఉంది. మిలిటెంట్ల కార్యకలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి. షోపియాన్‌లో 2014లో 52.06 శాతం ఓట్లు పోలైతే ఈ సారి ఓటింగ్ శాతం స్వల్పంగా 54.72 శాతానికి పెరిగింది.

పుల్వామాలోని గుండీబాగ్-కొల్పొరా 2019లో 40 మంది కేంద్ర రిజర్వు పోలీసు దళం జవాన్లను హత మార్చిన అదిల్ అహమద్ దార్ స్వస్థలం. హత్యకు గురైన హిజ్బుల్లా ముజాహిదీన్ కమాండర్ రియాజ్ నైకూ కూడా ఆ ప్రాంత వాసే. అయినా ఆ ప్రాంత ప్రజలు మెరుగైన పరిస్థితులు వస్తాయన్న ఆశతో ఓటును ఆయుధంగా మలుచుకున్నారు.

కశ్మీర్‌లో అణచివేత ఎంత తీవ్రంగా ఉందంటే ఆగస్టు 15 వస్తే జనాన్ని నిర్బంధిస్తారు. ఏ ప్రముఖుడు వచ్చినా యువతను పోలీసు స్టేషన్లకు పిలిపిస్తారు. ఇలాంటి వాటికి అంతం ఉంటుందన్న ఆశతోనే ఓటు వేశామని చాలా మంది యువకులు చెప్పారు. పుల్వామాలో కూడా గతం కన్నా ఈ సారి ఓటింగ్ శాతం పెరిగింది.

ఒకప్పుడు కశ్మీర్ మాత్రమే తీవ్రవాద కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది. గత అయిదేళ్ల కేంద్ర పాలన పుణ్యమా అని ఇప్పుడు జమ్మూలో తీవ్రవాద దాడులు పెరిగాయి. ఈ ఒక్క ఏడాది ఇప్పటి వరకు తీవ్రవాద దాడికి భద్రతా దళాలకు చెందిన 14 మంది, 11 మంది పౌరులు మరణించారు. కశ్మీర్‌లో అయిదుగురు భద్రతా సిబ్బంది, ఏడుగురు పౌరులు, 27 మంది తీవ్రవాదులు నేలకు ఒరిగారు. దీన్ని బట్టి 370వ అధికరణం రద్దు తరవాత తీవ్రవాదం తోక ముడిచిందన్న కేంద్ర ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనం బయట పడ్తోంది. ఈ ఎన్నికలు కశ్మీరీ పండితుల్లో కూడా ఆశలు రేకెత్తించాయి. ప్రజాస్వామ్యం నెలకొంటే తమ భూములు, ఆస్తులు తిరిగి వస్తాయన్న ఆశతో చురుకుగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో బీజేపీ ఒక వేపున ఉంటే కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ మరో వేపున ఉండి పోటీ చేస్తున్నాయి. ఈ మూడు పక్షాల మధ్య స్థూలమైన సీట్ల సర్దుబాటు జరిగింది. జమ్మూ-కశ్మీర్ శాసనసభలో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే 24 నియోజకవర్గాల పరిధిలో బుధవారం పోలింగ్ జరిగింది. వచ్చే బుధవారం రెండో దశ, అక్టోబర్ ఒకటిన తుది దశ పోలింగ్ జరగనుంది. ఫలితాలు అక్టోబర్ 8న వెలువడతాయి. ఇంతకు మునుపు జమ్మూ కశ్మీర్ లో 87 అసెంబ్లీ స్థానాలే ఉండేవి. 2022 లో నియోజకవర్గాల పునర్విభజనతో మూడు సీట్లు పెరిగాయి. దీనివల్ల కొన్ని నియోజకవర్గాల రూపురేఖలు మారిపోయాయి. కొన్నింటి పేర్లు మారిపోయాయి. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కశ్మీర్‌లో 47 నియోజకవర్గాలు, జమ్మూలో 43 స్థానాలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది సీట్లు షెడ్యూల్డ్ కులాల వారికి కేటాయించారు. మిగతా రెండు దశల పోలింగ్ ముగిసి బీజేపీ ఓడిపోతే అయిదేళ్ల నుంచి మోదీ ప్రభుత్వం చేసిన ప్రచారం ఎంత బూటకమో తేలిపోతుంది. ఓటర్ల ఉత్సాహం దీనికే సంకేతం కావొచ్చు.

మోదీ వంద రోజుల పాలన అధ్వానం

సుశీల్‌కుట్టి

మూడవ సారి అధికారాన్ని చేపట్టిన ప్రధాని నరేంద్రమోదీ పాలన గడచిన వంద రోజుల్లో అత్యంత అధ్వాన్నంగా ఉందని ఫ్రాన్స్ వార్తాపత్రిక లిమాండే ప్రకటించింది. సెప్టెంబర్ 17 వ తేదీతో మోదీ వయసు 74 సంవత్సరాలు దాటి 75 లో పడ్డారు. వందరోజుల పాలన, అలాగే ఆయన పుట్టిన రోజు ఒకేరోజు అయ్యాయి. 2024 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సగం విజయమే సాధించారు. అయినప్పటికీ రెండు ప్రాంతీయ పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. పూర్తి విజయం సాధించలేకపోవటంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలలో తీవ్ర చర్చ సాగుతోంది. మోదీ పాలనలో ఈ సంవత్సరం ఇంకా అనేక రాష్ట్రాలలో ఎన్నికల పరీక్షలను ఎదుర్కోవలసి ఉంది. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీల ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. జమ్మూ- కశ్మీర్‌లోనూ ఇప్పటికే మొదటి దశ పోలింగ్ అయిపోయింది. మరో రెండు దశలలో జరగవలసి ఉంది. ఉత్తరప్రదేశ్‌లో పది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగవలసి ఉంది. జార్ఖండ్ అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్నాయి. దశాబ్ది కాలంలో మోదీ ఎన్నికల నిర్వహణలో అలసిపోయినట్టున్నారు. మోదీ-షా ద్వయం అబద్దాలను ప్రచారం చేసినప్పటికీ చివరకి సొంతంగా గెలవలేని పరిస్థితి ఏర్పడింది. జమ్మూ-కశ్మీర్‌కున్న స్వయం ప్రతిపత్తిని లేకుండా చేసేందుకు అధికరణలు 370, 35ను రద్దు చేశారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి గెలుపొందినట్లయితే తిరిగి కశ్మీర్‌కు రాష్ట్ర స్థాయిని కల్పిస్తామని వాగ్దానం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాత్రం 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం సాధ్యమే కాదని, అది కొనసాగుతుందని అన్నారు.

ఈ ఎన్నికల్లో అబ్దుల్లాలు గెలవడం మోదీ-షాకు ఎంతమాత్రం ఇష్టంలేదు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కశ్మీర్‌కి తిరిగి రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని వాగ్దానం చేశారు. మోదీ వంద రోజుల పాలనలో జమ్మూ-కశ్మీర్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేయలేదు. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌ల పొత్తు ఎన్నికల్లో విజయానికి దారితీస్తుందని భావిస్తున్నారు. గెలుపొందితే పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని పునరుద్ధరించడానికి అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాకిస్తాన్‌లో శిక్షణ పొందిన టెర్రరిస్టులతో భారతదేశ సైన్యం పోరాటం చేయటానికి కష్టపడుతున్నారు. టెర్రరిస్టులతో జరుగుతున్న పోరాటాలలో ప్రత్యేకించి జమ్మూలో అనేక మంది భారత సైనికులు, అధికారులు ప్రాణాలు కోల్పోతున్నారు. 370 అధికరణను రద్దు చేయటం ద్వారా కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేస్తామని మోదీ ప్రభుత్వం వాగ్దానం చేసింది. అలాగే ఆ రాష్ట్రాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ వాగ్దానాలలో ఒక్కటీ అమలు జరగలేదు. ఈ వంద రోజుల పాలనలో ముఖ్యంగా జమ్మూ ప్రాంతంలో భారత సైన్యం తరచూ ప్రాణాలు అర్పిస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం పాకిస్థాన్‌తో తిరిగి చర్చలు జరిపేందుకు ఏమాత్రం ఆసక్తి చూపడంలేదు. మోదీ ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల ఎటువంటి విధానాన్ని నిర్ధారించలేదు. ఫలితంగా అనేక ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పాకిస్థాన్ సైన్యం ఆధునిక ఆయుధాలను సమీకరించుకుంటున్నది. పాకిస్థాన్‌లో శిక్షణ పొందిన టెర్రరిస్టులు జమ్మూ-కశ్మీర్‌లో అడ్డదారిన ప్రవేశించకుండా ఎవరూ నిరోధించలేకపోయారు. పాకిస్థాన్‌తో వేగంగా, కఠినంగా వ్యవహరించడానికి బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేయలేదు. వీలైనంత త్వరగా పాకిస్థాన్‌కు ఎన్డీఏ ప్రభుత్వం గుణపాఠం చెప్పవలసింది. ఇప్పటికైనా ఆ పని పూర్తిచేయాలి. అయితే మోదీ మొదటి వంద రోజుల్లో గుణపాఠం చెప్పటానికి ఏమాత్రం పూనుకోలేదు. పాకిస్థాన్ నుంచి వచ్చే టెర్రరిస్టులు భారత సైన్యాని కంటే మిక్కిలిగా పోరాడుతున్నారు.

మోదీ రెండుసార్లు నిర్వహించిన పాలనా కాలంలో పాకిస్థాన్ మోదీ ఆలోచనను ఏమాత్రం పసికట్టలేకపోయింది. ఈ వంద రోజుల పాలనలో కూడా అదే జరిగింది. ఉక్రెయిన్- రష్యా మధ్య యుద్ధ వ్యవహారాలలో చిక్కుకుపోయారు. జమ్మూ అటవీ ప్రాంతాలలో భారత సైన్యం ఎక్కువగా మృతి చెందినప్పటికీ మోదీ ప్రభుత్వం గట్టిగా ఎదుర్కోలేకపోయింది. జమ్మూ- కశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం కావాలని మన శత్రువు పాకిస్తాన్ కోరుకుంటోంది. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే మోదీ ప్రభుత్వం ఏం చేస్తుంది? కొత్త ప్రభుత్వం తిరిగి రాష్ట్ర హోదాను సాధించటమే ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆర్టికల్స్ 370, 35 లను ఏమి చేస్తారు? రాష్ట్ర ప్రభుత్వం షా చెప్పినట్టుగా ఆర్టికల్ 370 ని తిరిగి రద్దు చేయగలదా? అలా రద్దు చేయడానికి అవసరమైన రాజ్యాంగ అవకాశాలు కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటాయా? జమ్మూ-కశ్మీర్‌లో తిరిగి రాళ్ల దాడులు జరుగుతాయా? అప్పుడు మోదీ ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను ఇప్పటికైనా వెల్లడించాలి. రాహుల్‌గాంధీ లోయలో ప్రచారానికి వెళ్లినప్పుడు 370 ఆర్టికల్‌ను ప్రస్తావించకుండా జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని తిరిగి సాధిస్తామని మాత్రమే వాగ్దానం చేశారు. రాహుల్ ప్రచారానికి వెళ్లి వచ్చిన తర్వాత జమ్మూ- కశ్మీర్‌లో తామే విజయం సాధించగలమని మాట్లాడారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మాక్రాన్, నరేంద్రమోదీల మధ్య స్నేహం ఉంది. ఎన్నికల్లో ఈ రెండు దేశాలు కూడా "సగం విజయాలు" మాత్రమే పొందాయి. మాక్రాన్‌కు భవిష్యత్ అంత ఆశాజనకంగా ఉండదని సమాచారం అందుతోంది. మోదీ పరిస్థితి కూడా అదే విధంగా ఉండవచ్చునని భావిస్తున్నారు. వివిధ రాష్ట్రాలకు జరగనున్న ఎన్నికల్లో బీజేపీ అపజయాలను మూటకట్టుకోవచ్చునని అంచనాలు వస్తున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో మోదీ "సగం విజయం" సాధించడం వల్ల బీజేపీ నిరాశలో మునిగింది. మోదీ మాత్రం విచార వదనంతో ఉంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోడ్పాటు అందించినప్పటికీ ఇది చివరి వరకు కొనసాగుతుందా! ఈ రెండు పార్టీల అభిప్రాయాలు, ఆలోచనలపైన ఎన్డీఏ ప్రభుత్వం ఆధారపడి కొనసాగుతుంది. వంద రోజుల పాలనలో మోదీ ప్రభుత్వం అనేక యూటర్న్‌లు తీసుకుంది. 2024 వక్ఫ్ బోర్డు బిల్లు, సెక్యులర్ సివిల్ కోడ్‌లపై మోదీ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది.

యుద్ధంలో కొత్త దశ: ఇజ్రాయిల్

జెరూసలేం: లెబనాన్‌లో పేజర్లు, వాకీ టాకీల పేలుళ్లతో ఇజ్రాయిల్‌కు, హెజ్బుల్లాకు మధ్య యుద్ధం తప్పదన్న సంకేతాలు వెలువడ్డాయి. పశ్చిమాసియా సంక్షోభానికి దౌత్యపరమైన పరిష్కారం లభించే ఆశలు సన్నగిల్లాయి. యుద్ధంలో కొత్త దశ మొదలైనట్లు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ప్రకటించడంతో యుద్ధం జరుగుతుందన్న వాదన బలపడింది. ఇజ్రాయిల్, హెజ్బుల్లా మధ్య పరిస్థితులు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. ప్రత్యక్ష యుద్ధాన్ని నివారిస్తూ వచ్చిన ఈ ప్రత్యర్థులు ఇప్పుడు అందుకు కాలు దువ్వుతున్నట్లుగా తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. మంగళ, బుధవారాల్లో జరిగిన పేలుళ్లు ఇందుకు నిదర్శనం. వేలాది మందిపై దాడి చేసి యుద్ధం రాదని అనుకోవడం పొరపాటే అవుతుందని ఇజ్రాయిల్ రిటైర్డ్ బ్రిగేడియర్ జనరల్ అమీర్ అవివీ అన్నారు. ఈయన ఇజ్రాయిల్ రక్షణ, భద్రతా ఫోరానికి నాయకుడు. 'మేము యుద్ధాన్ని కోరుకోలేదు కాబట్టే 11 నెలలుగా ఇలా చేయలేదు. ఇప్పుడు పరిస్థితి మారింది. యుద్ధానికి ఇజ్రాయిల్ సిద్ధంగా ఉంది' అని ఆయనన్నారు. 'మా మిషన్ స్పష్టం... సాధ్యమైనంత త్వరగా భద్రతాపరమైన వాస్తవికతను మార్చాలని కృతనిశ్చయంతో ఉన్నాం' అని ఇజ్రాయిల్ నార్తెన్ కమాండ్‌కు నాయకత్వం వహించే మేజర్ జనరల్ ఓరి గోర్డిన్ వెల్లడించారు. సహనం కోల్పోతున్నామంటూ ఇజ్రాయిల్ నేతలు ప్రకటనలు చేశారు. ఇక ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గల్లంత్ స్పందిస్తూ హెజ్బుల్లాపై ఇజ్రాయిల్ దృష్టి మళ్లించిన క్రమంలో యుద్ధంలో కొత్త దశ మొదలైందన్నారు. వనరులు, దళాలను ఉత్తరం వైపుకు మళ్లుతుండంతో అది కేంద్రబిందువైందని చెప్పారు. లెబనాన్‌పై పెద్ద దాడికి ఇజ్రాయిల్ ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేదని స్థానిక మీడియా పేర్కొంది. హెజ్బుల్లా ప్రతిస్పందనపై ఇజ్రాయిల్ నిర్ణయం ఆధారపడి ఉంటుందని తెలిపింది. దీంతో యుద్ధం అనివార్యమన్న అభిప్రాయం వ్యక్తమైంది.

32కు పెరిగిన వాకీటాకీ పేలుళ్ల మృతులు

బీరుట్: లెబనాన్‌లో వాకీటాకీ పేలిన ఘటనలో మృతుల సంఖ్య 32కు పెరిగింది. గాయపడిన వారి సంఖ్య 3,250కు పైగా ఉంది. హెజ్బుల్లా సభ్యులు వినియోగించే వేలాది పేజర్లు పేలిన మరుసటి రోజు అంత్యక్రియల జరుగుతుండగా వాకీటాకీలు పేలడం కలకలం రేపింది. ఈ పని ఇజ్రాయిల్‌దేనని హెజ్బుల్లా ఆరోపించింది. ప్రతీకారం తీర్చుకుంటామని తేల్చిచెప్పింది. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై ఐరాస ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఆందోళన వ్యక్తంచేశారు. హెజ్బుల్లా లక్ష్యంగా ఇలాంటి ఘటనలు జరగడం లెబనాన్‌లో అత్యంత ప్రమాదకర పరిస్థితులుకు దారితీయొచ్చని హెచ్చరించారు. ఈ పరిస్థితిని నివారించేందుకు సాధ్యమైనచర్యలన్నీ తీసుకోవాలని గుటెర్రస్ పిలుపునిచ్చారు. పేజర్ల పేలుళ్లపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి శుక్రవారం భేటీ కానుంది. లెబనాన్ పరిణామాలపై అమెరికా స్పందిస్తూ పరిస్థితి మరింత జఠిలం కానివ్వదని సూచించింది. అదనపు సైనిక చర్యలు చేపట్టడం ద్వారా ప్రస్తుత సంక్షోభానికి పరిష్కారం లభిస్తుందని తాము అనుకోవడం లేదని అమెరికా జాతీయ భద్రతా మండలి అధికారి జాన్ కిర్బీ అన్నారు.

రేపు శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు

ప్రచారం చివరి రోజు 11 ర్యాలీలతో అభ్యర్థుల సందడి

కొలంబో: శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు శనివారం (21వ తేదీన) జరగనున్నాయి. గురువారంతో ప్రచారానికి తెర పడింది. మైకులు మూగబోయేందుకు ముందు అంటే ప్రచారం చివరి రోజు 11 ప్రచార ర్యాలీలు జరిగాయి. రణిల్ విక్రమసింఘె స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మతారా, గల్లె, కలుత్వారా, హోమాగామా, మరాదానా ప్రాంతాలలో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఒక్క మతారాలోనే మూడు ర్యాలీలు చేపట్టారు. పెద్దఎత్తున ప్రచారం చేశారు. అలాగే ప్రతిపక్ష నాయకుడు సజిత్ ప్రేమ్ దాస్ ప్రచారాన్ని హోరెత్తించారు. టవర్‌హాల్ వరకు ప్రదర్శనతో తన ప్రచారాన్ని ముగించారు. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) అభ్యర్థి అనురా కుమార డిస్సానాయకె, ఎస్ఎల్‌పీపీ అభ్యర్థి నమల్ రాజపక్స కూడా చివరి రోజున పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

శుక్రవారం స్కూలు మూసివేత

పోలింగ్ ముందు రోజు అంటే శుక్రవారం అన్ని స్కూళ్లను మూసివేయాలని శ్రీలంక విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. స్కూళ్లను పోలింగ్ కేంద్రాలుగా వినియోగించుకోనేందుకు ఎన్నికల సంఘం చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. పోలింగ్ కేంద్రాలుగా స్కూళ్లను వాడేందుకు అనుమతులు ఇస్తూ, పోలింగ్ సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని జోనల్ డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్‌కు సూచించింది. ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా ఉండే స్కూళ్లను నిర్దేశిత సమయంలోనే మూసివేస్తారని తెలిపింది.

వైసీపీకి భారీ షాక్

(మూడోపేజీ తరువాయి)

వ్యవహరించారు. గత ప్రభుత్వ హయాంలో రెండు విడతలుగా నిర్వహించిన మంత్రివర్గ విస్తరణలోనూ సామినేనికి చోటు దక్కలేదు. అప్పటినుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నారు. పవన్‌ను కలిసిన అనంతరం సామినేని మీడియాతో మాట్లాడుతూ... వైసీపీలో పరిస్థితి చాలా దారుణంగా ఉందని, నా మనసుకు కష్టం కలగడంతోనే పార్టీని వీడినట్లు చెప్పారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో తానెంతో సన్నిహితంగా పనిచేశానని, అదే అంకితభావంతో ఆయన కుమారుడైన వైసీపీ అధినేత జగన్‌తో కలిసి నడిచానని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు అనేకసార్లు జగన్‌ను కలిసి పార్టీ పరిస్థితిని చెప్పినప్పటికీ పట్టించుకోలేదని, వైసీపీలో పరిణామాల్ని చూస్తే ఆ పార్టీకి భవిష్యత్తు లేదనిపిస్తోందన్నారు. మా భవిష్యత్తు మేము చూసుకోవాలనే బయటకి వచ్చామని, పవన్ కల్యాణ్‌తో కలిసి అన్ని విషయాలు చర్చించామన్నారు. ఈనెల 22న బాలినేని శ్రీనివాసులురెడ్డి, సామినేని ఉదయభాను జనసేనలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కూటమి పార్టీల నాయకులతో కలిసి నడిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని సామినేని తెలిపారు.

జగన్‌కు విశ్వసనీయత లేదు: బాలినేని

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విశ్వసనీయత లేదని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. వైసీపీలో త్యాగాలు చేసిన వారికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను గెలిపించాలని ఆనాడు రాజీనామాలు చేశామని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను జగన్‌రెడ్డి మరిచిపోయారని ధ్వజమెత్తారు. సభల్లో జగన్ ఎప్పుడూ తన గురించి మాట్లాడలేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ పవన్ కల్యాణ్ తన గురించి మాట్లాడారని ప్రశంసించారు. తనపై పవన్ ఎంతో అభిమానంతో ఉన్నారని కొనియాడారు. పవన్‌తో కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

24×7 ఇసుక బుకింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉచితంగా ఇసుక ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని, ఇకపై 24గంటలు బుకింగ్ చేసుకోవచ్చు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇసుక నిర్వహణ విధానం నూతన పోర్టల్‌ను ఆయన గురువారం వెలగపూడి సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులకు మార్గదర్శకాలు చేశారు. ఇసుక బుకింగ్ విషయంలో సమయ నిబంధనలు అవసరం లేదన్నారు. రానున్న వారం రోజుల్లో ఇసుక బుకింగ్‌కు సంబంధించి ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న వాగులు, వంకలలో ఉండే ఇసుక విషయంలో సమీప గ్రామాల ప్రజలను ఇబ్బంది పెట్టరాదని, ప్రతి ఒక్కరికీ ఇసుక అందేలా పారదర్శకత ఉండాలని ఆదేశాలిచ్చారు. అక్రమ రవాణా, మైనింగ్‌కు అవకాశంలేకుండా చర్యలు ఉండాలన్నారు. విజిలెన్స్ వ్యవస్థను పటిష్టపర్చాలని చంద్రబాబు ఆదేశించారు. అబ్కారీ, గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఇసుక సరఫరాకు సంబంధించి మూడో పార్టీ తనిఖీకి పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. ప్రతి అంశాన్ని మూడో పార్టీ ఎప్పటికప్పుడు గమనిస్తుందన్నారు. నూతన పోర్టల్ వల్ల వివిధ దశలలో అనుక్షణం నిఘా ఉంటుందని, అధికారుల మొదలు రవాణాదారుల వరకు తప్పుకు ఆస్కారం ఉండరాదన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీలు స్థానిక వ్యవస్థలను నియంత్రిస్తాయని తెలిపారు. పోర్టల్‌లో జిల్లాల వారీగా సరఫరా కేంద్రాలు, రవాణా చార్జీలు వంటి వివరాలు ఏ రోజుకు ఆ రోజు అప్‌డేట్ అవుతాయని చెప్పారు. లారీల యజమానులు, మధ్యవర్తుల పేరిట వసూలు చేస్తున్న అధిక ధరల నియంత్రణకు ఈ పోర్టల్ దోహదమవుతుందని మంత్రి తెలిపారు. ఉచిత ఇసుక విషయంలో ప్రజలు తమ ఇబ్బందులను టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-4599కు ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి ఫిర్యాదుపైనా చర్యలు ఉంటాయన్నారు. సంబంధిత వ్యక్తులకు కలక్టరేట్ల నుంచి సమాచారం అందుతుందని మంత్రి వెల్లడించారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ఇసుక రవాణా లారీలకు జీపీఎస్ అనుసంధానం చేయటం వల్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పద్ధతికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఎప్పటికప్పుడు వినియోగదారుల స్పందనను తీసుకుంటామన్నారు. పటిష్టంగా చెక్ పోస్టులను నిర్వహిస్తామని తెలిపారు. ఇసుక కొరత లేకుండా స్టాక్‌యార్డ్‌లలో లోడింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ముఖేశ్ కుమార్ చెప్పారు. గనుల శాఖ సంచాలకులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇసుక ఎగుమతి కేంద్రాలలో సీసీటీవీ నిఘా ఉంటుందన్నారు. జిల్లా స్థాయి కమిటీలకు తగిన బాధ్యతలు, అధికారాలు అప్పగించామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ, గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు లక్ష్యం

స్వర్ణాంధ్ర-ఏ 2047 డాక్యుమెంట్ విడుదలకు చర్యలు

సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వర్ణాంధ్ర-ఏ 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి నవంబరు 1వ తేదీన ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047లో భాగంగా స్వర్ణాంధ్ర-ఏ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖాధిపతులు, కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఏడాదికి 15శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-ఏ2047 విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వివరించారు. 2047నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిద్దడంతో పాటు 43వేల డాలర్లకు పైగా తలసరి ఆదాయంతో కూడిన 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గల రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈవిజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఏపీ 974కిలోమీటర్ల పొడవుగల సముద్రతీర ప్రాంతాన్ని కలిగి ఉందని, ప్రస్తుతమున్న పోర్టులతో పాటు కొత్తగా మూలపేట, గంగవరం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. పోర్టు ఆధారిత పరిశ్రమలు తీరప్రాంత జిల్లాల్లో ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు. ఎగుమతి, దిగుమతులకు పెద్దఎత్తున అవకాశాలు కలుగనున్నాయని చెప్పారు. వ్యవసాయంతో పాటు ఆక్వారంగం పెద్దఎత్తున అభివృద్ధి చెందుతోందని, బ్లూఓషన్ ఎకానమీని దృష్టిలో ఉంచుకుని ఐదేళ్ల కాలానికి జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. జిల్లా ప్రణాళిక ఆధారంగా చేసుకుని మండల స్థాయిలో ఐదేళ్ల విజన్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. స్వర్ణాంధ్ర-ఏ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సంబంధించి ప్రజలు వివిధ స్టేక్ హోల్డర్ల నుంచి సూచనలు, సహాలు, అభిప్రాయాలు, స్పందనను తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ముసాయిదా డాక్యుమెంట్‌ను ఈనెల 21 నుంచి అక్టోబరు 5వరకు ఐటీ విభాగం ద్వారా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని వివరించారు. దీనిపై ఈనెల 21 నుంచి అక్టోబరు 5లోగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మండల, మున్సిపల్, గ్రామ పంచాయితీ స్థాయిల్లో అవగాహనా సదస్సులను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, సీడీఎంఏ హరినారాయణ, పంచాయితీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి, ప్రణాళికాశాఖ జేఎస్ అనంతశంకర్, వివిధ శాఖల కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

రేపు ఢిల్లీ సీఎంగా ఆతిశీ ప్రమాణం

(మూడోపేజీ తరువాయి)

ముఖేశ్ అహ్లావత్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించనున్నట్లు సమాచారం. ఆయన సుల్తాన్‌పురి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం ఐదుగురు మంత్రులు ప్రమాణం చేయనున్నారు. అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో మంత్రిగా కొనసాగిన ఆతిశీ సీఎంగా నియామితులయ్యారు. సీఎంతో పాటు మంత్రులు సైతం ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఆ ప్రతిపాదనలకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. కేజ్రీవాల్ తన రాజీనామాతో పాటు కొత్త సీఎంగా ఆతిశీ పేరును ప్రతిపాదిస్తూ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఎల్‌జీకి ప్రతిపాదనలు అందజేశారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు సైతం ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రపతి ఆమోదంతో శనివారం ప్రమాణస్వీకారం తేదీని ఎల్‌జీ నిర్ణయించారు. కేజ్రీవాల్ రాజీనామాతో సాంకేతికంగా మంత్రివర్గం మొత్తం రద్దవుతుంది.

'పచ్చల'కు ప్రముఖుల ఘననివాళి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: అమరజీవి కమ్యూనిస్టు కోటయ్య చిన్న కుమారుడు పచ్చల శ్రీనివాసరావు సంస్మరణ సభ ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఎంహెచ్‌ఆర్ కన్వెన్షన్‌లో గురువారం జరిగింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వేమూరి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్టాబత్తిన చిట్టిబాబు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.జమలయ్య, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బగావ్ హేమంతరావు, సమితి సభ్యులు చిట్టినేని కర్ణ, జి.గోవిందరావు, ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి పోటు ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, తోట రామాంజనేయులు, పుచ్చకాయల ప్రభాకర్, బండి ఉపేంద్ర, పుచ్చకాయల సుధాకర్, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతివరప్రసాద్, ప్రముఖ బీసీ నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, పుప్పాల సత్యనారాయణ, పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బూదాల శ్రీనివాసరావు, రామసుబ్బాయమ్మ, టి.బాబురావు, ఏఐటీయూసీ నాయకులు పేలూరి రామారావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, శశి, ఆటో యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, అరసం రాష్ట్ర నాయకులు శరశ్చంద్ర జ్యోతిశ్రీ, ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతరెడ్డి, జిల్లా కార్యదర్శి పీవీ మల్లికార్జునరావు, రైతు సంఘం నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుర్రంకొండ సత్యానందం, సీపీఎం నాయకులు చింతల భాస్కరరావు, సీపీఐ తాడికొండ నాయకులు రేపూడి శ్రీనివాసరావు, పచ్చల శ్రీనివాసరావు సోదరుడు, సీపీఐ జిల్లా పూర్వ కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, మంగళగిరి కార్యదర్శి జాలాది జాన్‌బాబు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యాలయ కార్యదర్శి వి.రమణ... పచ్చల శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

'జమిలి' ఆచరణ సాధ్యమేనా?

(మూడోపేజీ తరువాయి)

చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు పలు కీలక రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు ఆమోద ముద్ర వేయాలి. ప్రధానంగా 6 రాజ్యాంగ సవరణలు అవసరం. లోక్‌సభ, రాజ్యసభల కాలపరిమితికి సంబంధించిన ఆర్టికల్ 83, రాష్ట్రాల అసెంబ్లీలకు ఐదేళ్ల గడువును నిర్దేశించే ఆర్టికల్ 172(1), రాష్ట్రపతికి లోక్‌సభను రద్దు చేసే అధికారాలిచ్చే ఆర్టికల్ 85 (2) (బి), రాష్ట్ర అసెంబ్లీల రద్దు అధికారం గవర్నర్‌కు దఖలు పరిచే ఆర్టికల్ 174 (2) (బి)కి సవరణలు చేయాలి. రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనకు వీలు కల్పించే ఆర్టికల్ 356, ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324కు సవరణలు చేయాల్సి ఉంటుంది. ఈ రాజ్యాంగ సవరణలను పార్లమెంటు 2/3 మెజారిటీతో ఆమోదించాలి. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ ఆ మార్కు దాటాలంటే సొంత బలగంతో పాటు అదనంగా ఎంపీల మద్దతు కూడ గట్టాల్సి ఉంటుంది. రాజ్యసభలో మరింత ఎక్కువ కష్టపడాల్సి ఉంటుంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల అనంతరం లోక్‌సభలో ప్రస్తుతం ఎన్‌డీఏకు 293 ఎంపీల బలముంది. జమిలి ఆమోదానికి 362 మంది ఎంపీల మద్దతు అవసరం. ఇక రాజ్యసభలో ఎన్‌డీఏ బలం 121 కాగా జమిలి ఆమోదానికి 164 మంది ఎంపీల మద్దతు కావాల్సి ఉంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే కాకుండా సమాఖ్య వ్యవస్థ కలిగిన దేశం కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాల మాటకూ విలువ ఉంటుంది. పార్లమెంటుతో పాటు దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఇందుకు అంగీకరించాలి. అంటే 14 రాష్ట్రాలకు పైగా జమిలికి సరేననాలి. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ సొంతంగా 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. అందులో బీజేపీ సొంతంగా 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఒకేసారి మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్ల పెంపు, జమిలి ఎన్నికల విధానాన్ని అమలుచేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇవన్నీ ఎన్‌డీఏ సర్కార్ ఎలా అమలు చేస్తుందనే విషయమై ఆసక్తి నెలకొంది.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

(మూడోపేజీ తరువాయి)

వివిధ రాష్ట్రాలు బ్రహ్మాండంగా వినియోగించుకున్నాయని చెప్పారు. 2019కి ముందే అనేక గ్రామాల్లో నిర్మాణమై ఉన్న ట్యాంకర్ల ద్వారా ట్యాప్ కనెక్షన్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేశామని...తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. సురక్షిత తాగునీటిని ప్రతి ఇంటికీ నిరంతరం అందించేందుకు సమీపంలోని రిజర్వాయర్ల నుండి గ్రామాలకు పైప్ లైన్లు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా అయ్యేలా కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. ఇందుకోసం నీటి సామర్థ్యం, వినియోగంపై ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. శాశ్వతంగా 95 లక్షల గృహాలకు నిరంతరం తాగునీరు అందించాలన్నారు. పనులు చేపట్టిన గుత్తేదారులు నిర్ణయించిన కాలానికి మెయింటెనెన్స్ చేయడంతో పాటు ఎలాంటి నాణ్యతతో కూడిన మెటీరియల్ వాడుతున్నారో తనిఖీలు చేయాలని చెప్పారు. గత ఐదేళ్లలో జల్ జీవన్ మిషన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి ఉంటే ఈ పాటికే ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీరు అందేదన్నారు. మళ్లీ 3 నెలల్లో పనులు పట్టాలెక్కించి పరుగుల పెట్టించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆయా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

37 వేల తీర్పులు హిందీలోకి అనువాదం

(మూడోపేజీ తరువాయి)

తీర్పులను అనువదిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ ప్రకారం 22 భాషల్లోకి అనువదిస్తున్నట్టు తెలిపారు. అతిత్వరలో ఈ భాషల్లోనూ తీర్పులను అనువదించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. విచారణ సమయంలో ఈ-ఎస్‌సీఆర్ ద్వారా తీర్పులు ఇవ్వాలని న్యాయవాదులకు జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచించారు. ఈ-ఎస్‌సీఆర్ ద్వారా సుప్రీంకోర్టు తీర్పులను ఉచితంగా పొందేందుకు సామాన్య ప్రజలు, న్యాయ విద్యార్థులకు వీలు కల్పించింది. ఈ ప్రాజెక్టును 2023లో ప్రారంభించింది. విచారణ సమయంలో న్యాయవాదులు ఈ-ఎస్‌సీఆర్‌ను ఉపయోగించి తమ వాదనల్లో గతంలో ఇచ్చిన తీర్పులు, సంఘటనలను ఉదహరించాల్సి ఉంటుంది. ఈ తీర్పులు సుప్రీంకోర్టు వెబ్‌సైట్, మొబైల్ యాప్, నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జేడీజీ)కి సంబంధించిన జడ్జిమెంట్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. సుప్రీం తీర్పుల అనువాదం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని జిల్లా కోర్టుల్లో అందుబాటులోకి వస్తుందని ధర్మాసనం పేర్కొంది.

ఏపీకి మళ్లీ తుపాను

(మూడోపేజీ తరువాయి)

ఏర్పడుతుందని, ఇది తీవ్ర రూపం దాల్చి తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేసింది. దీని ప్రభావం వల్ల ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే రాష్ట్రంలోని ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కోనసీమ, అనకాపల్లి జిల్లాలలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని, తీర ప్రాంతం వెంబడి గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

విజయవాడలో భద్రత కల్పించండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తనపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, కేసు ముగిసేంత వరకు విజయవాడలో తనకు భద్రత కల్పించాలని రాష్ట్ర హోంమంత్రి అనితకు నటి జెత్వాని విజ్ఞప్తి చేశారు. సచివాలయంలోని హోంమంత్రి ఛాంబర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి అనితను జెత్వాని కలిశారు. మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. న్యాయం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ఆమెకు హామీనిచ్చారు. దోషులు ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షపడేలా చేస్తామన్నారు. భద్రత విషయంలో భయం వద్దని భరోసానిచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి హామీనిచ్చారు. కేసు పురోగతిపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం స్పందించిన తీరుతోనే తాను ధైర్యంగా గొంతెత్తగలిగినట్లు జెత్వాని తెలిపారు. కేసు నమోదైన తర్వాత తన వ్యక్తిత్వంపై దాడి చేసిన పత్రిక, ఛానల్ గురించి హోంమంత్రికి వివరిస్తూ జెత్వాని భావోద్వేగానికి గురయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా ఇంకా స్వేచ్ఛ రాలేదనడానికి నీ పరిస్థితి మరో ఉదాహరణ అంటూ జెత్వానిని మంత్రి ఓదార్చారు. జెత్వాని అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనపై అక్రమ కేసు గురించి మంత్రికి వివరించినట్లు తెలిపారు.

అమరావతిపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

మాజీ మంత్రి సోమిరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వైసీపీ అధినేత జగన్ అధికారం కోల్పోవడంతో ఏపీ రాజధాని అమరావతిపై విషం కక్కుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధాని అమరావతి అత్యంత సురక్షితమైన ప్రదేశమని, కృష్ణానదికి ఆనుకుని ఉన్నా అమరావతికి ఇబ్బంది లేదన్నారు. కృష్ణా నదికి రికార్డుస్థాయిలో 11.43లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా...చుక్క నీరు నిలవలేదని అన్నారు. అమరావతిలో వర్షపునీరు తప్ప వరద రాలేదన్నారు. చంద్రబాబు పాలనలో అమరావతికి పెట్టుబడులు భారీగా వస్తుండడంతో, వాటిని ఆపేందుకు జగన్ కుట్రపూరిత చర్యలకు దిగడం సిగ్గు చేటన్నారు. అమరావతి గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదని అన్నారు. రాజధాని అమరావతిని నాశనం చేయడమే వైసీపీ పంతంగా పెట్టుకుందని మండిపడ్డారు.

బెజవాడలోనే 70 ఎకరాల ఆక్రమణ

(మూడోపేజీ తరువాయి)

ప్రాంతంలో అంతా వ్యవసాయ భూములే కాబట్టి అక్కడ దీనికి ఉన్న అవకాశాలను గుర్తించాలని అధికారులకు సూచించామన్నారు. ఇలా అన్ని అంశాలూ ఒక కొలిక్కి వచ్చిన తరువాత సమగ్ర నివేదిక సిద్ధం చేసుకుని కార్యాచరణ ప్రణాళికను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని, ఆయన ఆదేశాలకనుగుణంగా బుడమేరు ఆపరేషన్ ప్రారంభిస్తామని మంత్రి నిమ్మల తెలిపారు.

లెఫ్ట్ విధానాలు పట్టని అధికారులపై వేటు: సీపీఐ

తిరువనంతపురం: ఆర్ఎస్ఎస్ నాయకులతో కేరళ సీనియర్ పోలీసు అధికారి ఎంఆర్ అజిత్ కుమార్ 2023లో భేటీ కావడంపై వివాదం కొనసాగుతోంది. కేరళ ఏడీపీ (శాంతిభద్రతలు)గా ఆయన విధుల్లో ఉండటంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అసహనం వ్యక్తంచేసింది. నాటి సమావేశం అధికారికంగా జరిగిందా లేక వ్యక్తిగతమా అన్నది ఏడీజీపీ స్పష్టతివ్వాలని డిమాండ్ చేసింది. అందుకు ఆయన బాధ్యత వహించాలని పేర్కొంది. లెఫ్ట్ విధానాలు పట్టని అధికారులను తొలగించాలని కేరళ ప్రభుత్వానికి సీపీఐ పిలుపునిచ్చింది. అధికార ఎల్డీఎఫ్‌లో సీపీఐ కీలక భాగస్వామి. కాగా, సీపీఐ సీనియర్ నేత కె.ప్రకాశ్ బాబు ఈ మేరకు వ్యాసాన్ని పార్టీ అధికార పత్రిక జనయుగంలో రాశారు. తన వ్యాసం ద్వారా ఏడీజీపీ విషయంలో పార్టీ వైఖరిని వెల్లడించినట్లు ప్రకటించారు. ఇలాంటి వాటి (అజిత్ కుమార్ నాడు ఆర్ఎస్ఎస్ నేతలతో భేటీ కావడాన్ని ఉద్దేశించి)పై పోలీసు చీఫ్ లేక హోంశాఖకు కనీసం సమాచారం ఇవ్వాలని ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. ఏడీజీపీ అలా చేసేందుకు విముఖంగా ఉంటే, ఆయనను పదవిలో నుంచి తొలగించాలన్నారు. ప్రజా ప్రభుత్వ ప్రజల అనుకూల వైఖరిని అర్థం చేసుకోలేని అధికారి... ప్రభుత్వాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తారని హెచ్చరించారు. ఏడీజీపీ ఇలాంటి పరిస్థితినే సృష్టించారన్నారు. భారత్‌లోని ఫాసిజం... మతతత్వ రూపంలో వ్యక్తమవుతోందనడంలో జాతీయ వామపక్ష పార్టీల్లో సందేహం లేదని తెలిపారు. పరిపాలన యంత్రాంగంలో ఎవరూ లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ లేక దాని నేతృత్వంలోని ప్రభుత్వ విధానాలను బేఖతరు చేయరాదని నొక్కిచెప్పారు. లెఫ్ట్ విధానాలు ఉల్లంఘించే అధికారులను తొలగించడం ద్వారా ప్రభుత్వ దృక్పథం, సిద్ధాంతాలు ప్రతిబింబిస్తాయని ప్రకాశ్ బాబు పేర్కొన్నారు.

వరద సాయం కోసం కేంద్రంపై ఒత్తిడి

- పంటనష్టాలు, ఆటోలకిచ్చే పరిహారం పెంచాలి
- బాధితులందరికీ ఆర్థికసాయం అందాలి
- సీఎం చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో వరదబాధితులకు కేంద్రప్రభుత్వం సాయం చేసేలా ఒత్తిడి చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబుకి గురువారం లేఖ రాశారు. వరదలు వచ్చిన వెంటనే స్పందించినందుకు సీఎంకి అభినందనలు తెలిపారు. అంతేగాక ప్రజలు, దాతలు, ఉద్యోగులు కూడా స్పందించి, బాధితులకు సహాయక చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆశ్చర్యకరంగా వెంటనే అధికారుల బృందాన్ని రాష్ట్రానికి పంపిందని, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వచ్చి వరద ముంపు ప్రాంతాలలో పరిశీలన చేసి వెళ్లినప్పటికీ ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహాయం చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే వరద సహాయాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని కోరారు. కాగా, వరద బాధితులను ఆదుకోవడంలో అత్యంత చొరవచూపిన దాతలకు, ఉద్యోగస్తులకు, పారిశుద్ధ్య కార్మికులకు సీపీఐ తరపున రామకృష్ణ అభినందనలు తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు చేయదల్చిన సహాయంపై ముఖ్యమంత్రి ప్రకటించడం మంచి పరిణామం అన్నారు. వరద ముంపు బాధిత ప్రజలను కోలుకోలేని రీతిలో దెబ్బతీసినందున వరద సాయాన్ని పెంచాలని రామకృష్ణ సూచించారు. ముఖ్యంగా రైతులకిచ్చే సాయాన్ని ఎకరాకు రూ.20 వేలకు, వరదకు దెబ్బతిన్న ఆటోలకిచ్చే పరిహారాన్ని రూ.20 వేలకు పెంచాలన్నారు. అంతేకాక ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, మ్యాక్సీ క్యాబ్‌లు, టాటా మ్యాజిక్ వంటి నాలుగు చక్రాల వాహనాలు కూడా పూర్తిగా నీటమునిగి, ఎందుకూ పనికిరాకుండా పోయాయని... దీనిపై గణన జరగలేదని, తక్షణమే వాటిని కూడా ఎన్యూమరేట్ చేసి పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే నీట మునిగిన ఇళ్లకు సంబంధించి, మొదటి అంతస్తులో ఉన్నవారు, అద్దెలకు నివాసమున్న వారిలో కొందరికి జరిగిన నష్టాన్ని ఎన్యూమరేషన్ టీమ్‌లు నమోదు చేయలేదని తెలిపారు. మరికొన్నిచోట్ల రేషన్‌కార్డులు, సచివాలయాలు, వలంటీర్ల పరిధి సాకుగా చూపి వరద నష్టాన్ని నమోదు చేయనట్లు తెలుస్తోందన్నారు. నష్టపోయిన వారందరికీ పరిహారం అందేలా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. వరద సహాయక నిధుల విడుదలకై కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిందిగా సీఎంని రామకృష్ణ కోరారు.

తిరుమలను అపవిత్రం చేశారు

తప్పు చేసినవారికి శిక్ష తప్పదు: చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో అపవిత్రమైన ముడిసరుకు వినియోగించారని, దీనిపై టీటీడీ విచారణలో వాస్తవాలు వెలుగుచూశాయని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఎన్డీయే ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా వెలగపూడిలో సచివాలయం వెలుపల ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. పేదలకు స్వయంగా టోకెన్లు ఇచ్చి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడారు. తిరుమలలో శానిటేషన్, ప్రసాదాలు, అన్న క్యాంటీన్లను గత పాలకులు దెబ్బతీశారు. వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లి పెళ్లిళ్లు, పేరంటాలు దగ్గర కూడా ఊరేగించే పరిస్థితికి వచ్చారు. ఆరోజు కూడా నేను తప్పుబట్టాను. రాజకీయ ప్రయోజనాల కోసం వేంకటేశ్వరస్వామిని ఉపయోగించు కోవడం కరెక్టు కాదు. ఎవరైనా శ్రీవారికి అపచారం తలపెడితే... వచ్చే జన్మలో కాదు, ఈ జన్మలోనే శిక్షిస్తాడని అందరూ నమ్ముతారు.హిందువులు జీవితంలో ఒక్కసారైనా వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని, కోరికలు చెప్పుకోవాలని అనుకుంటారు. అలాంటి పవిత్రమైన ప్రదేశాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించారు. తిరుమలలో ఇప్పటికే ప్రక్షాళన ప్రారంభించాం. చాలా వరకు ఫలితాలు వచ్చాయి. ఆధారాలు దొరికితే బాధ్యులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆగస్టు 15న 175 అన్న క్యాంటీన్లు ప్రారంభించామని, గురువారం 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా మరో 75 క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని, ఇప్పటి వరకు దాదాపు రూ.350 కోట్లు విరాళాలు అందాయని చంద్రబాబు తెలిపారు.

గిరిజనులను ఆదుకోండి

పక్కా ఇళ్లు నిర్మించండి

భూములకు పరిహారం: జేవీఎస్ డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం దారకొండ, గుమ్మిరేవుల, దుప్పలవాడ, సీలేరు, గాలికొండ, అమ్మవారి దారకొండ పంచాయతీల్లో రెండు వారాల క్రితం కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన గిరిజనులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి (జేవీఎస్) డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆ ఆరు పంచాయతీల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయని, గిరిజనులు ఇళ్లు, పంట పొలాలతోపాటు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారని చెప్పారు. ఇప్పటివరకూ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టలేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం తొంగి చూడలేదని, సహాయం కోసం గిరిజనులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. భారీ వర్షాలకు సుమారు 200 ఇళ్లు నీటిలో మునిగిపోయాయని వివరించారు. కొండ చరియలు విరిగిపడి ఒక మహిళ మృతి చెందిందని, మరో మహిళ గాయపడిందని తెలిపారు. గిరిజనులు అటవీ హక్కుల చట్టం కింద పంట పొలాలకు పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నా, అధికారులు సక్రమంగా స్పందించకపోవడంతో చాలామందికి పట్టాలు లేవని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.25 వేలు అందజేయాలని, నిత్యావసర వస్తువుల పంపిణీ, పంట నష్టం అందించాలని డిమాండ్ చేశారు. దారకొండ పంచాయతీ పరిధిలో సీపీఐ తరపున కొంత సహాయం అందించామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వర్ష బీభత్సం పై అధికారుల్లో ఇప్పటికీ చలనం లేకపోవడం దుర్మార్గమని విమర్శించారు. కట్టుకున్న బట్టలు కూడా కోల్పోయి తినడానికి తిండి కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెవిన్యూ అధికారులు ఒకరిద్దరు వచ్చి గ్రామాలను పరిశీలించినా ఇప్పటివరకూ ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం అందలేదని తెలిపారు. అంచనాలకు అందనంతగా ఆస్తి నష్టం సంభవించిందని చెప్పారు. పంట భూములు ఉనికి కోల్పోయాయని పేర్కొన్నారు. పట్టా భూములకే పరిహారం ఇస్తామంటే కుదరదని అటవీ హక్కుల చట్టం కింద అధికారి యంత్రాంగం అందరికీ పట్టాలు ఇవ్వడంలో విఫలమైందని అందువల్ల అందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గంజాయి సాగును గుర్తించేందుకు గతంలో అధికారులు డ్రోన్లను ఉపయోగించారని, ప్రస్తుతం డ్రోన్ కెమెరాలు జీపీఎస్ ద్వారా పంట నష్టం ఆస్తినష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు. పక్కా ఇళ్లను ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్ఓఆర్ఎఫ్ పట్టాలతో పాటు గిరిజనులు సాగు చేస్తున్న అన్ని రకాల భూములకు పరిహారం ఇవ్వాలని అన్నారు. వరదల వల్ల కోతకు గురైన భూములను సాగుకు అనుకూలంగా మార్చాలని కోరారు. అనుకూలం కానీ పక్షంలో ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎం.విమల, సీహెచ్ క్షేత్రపాల్ పాల్గొన్నారు.

ఐఐఎఫ్ఎల్‌కు ఆర్బీఐ ఊరట

న్యూఢిల్లీ: ఆర్థిక సేవల సంస్థ ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు ఊరట లభించింది. బంగారంపై రుణాలకు సంబంధించిన తమ వ్యాపారంపై ఆంక్షలను భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఎత్తివేసిందని ఆ సంస్థ వెల్లడించింది. గోల్డ్ లోన్ విభాగంలో లోపాలను గుర్తించిన ఆర్బీఐ... రుణాలు ఇవ్వడంపై ఆంక్షలు విధిస్తూ మార్చిలో ఆదేశాలిచ్చింది. ఇప్పుడు వాటిని ఎత్తివేసింది. ఈ మేరకు ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. నియంత్రణ సంస్థలకు, చట్టాలకు లోబడి బంగారం రుణాల జారీని ప్రారంభించడానికి అడ్డంకులు తొలగినట్లు పేర్కొంది.

విదేశీ విద్యార్థులకు కెనడా షాక్

ఒట్టావా: తమ దేశంలోని తాత్కాలిక నివాసితులను తగ్గించేందుకు విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లు, పని అనుమతులపై మరిన్ని ఆంక్షలను కెనడా విధించబోతోంది. పెరుగుతున్న నిరుద్యోగాన్ని పరిష్కరించడం కోసమే ఈ నిర్ణయమని చెబుతోంది. దీంతో భారత్ సహా ఇతర దేశాల విద్యార్థులపై ప్రభావం తీవ్రంగా ఉండనుంది. విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లను 35 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది నుంచి మరో 10 శాతం మేర కోత విధిస్తామని తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వలసలతో ప్రయోజనం ఉన్నాగానీ దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు ఆంక్షలు తప్పడం లేదని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వెల్లడించారు. గతేడాది 5,09,390 మంది విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లు జారీ కాగా ఈ ఏడాదిలో 1,75,920 మందికి అనుమతులిచ్చారని కెనడా విదేశాంగ శాఖ డేటా చెబుతోంది. 2025లో 4,37,000 స్టడీ పర్మిట్లు మాత్రమే జారీచేయనుంది. విదేశీ వర్కర్లు, విద్యార్థుల భాగస్వాములకు పని అనుమతులపైనా ఆంక్షలు విధించనున్నది.

వరద బాధితులకు బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల చేయూత

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సౌజన్యంతో ఏఐటీయూసీ అధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏఐటీయూసీ, కమ్యూనిస్టు పార్టీ గుర్తించిన 250 మందికి రెండు దుప్పట్లు, లుంగీలు, టవళ్లు చొప్పున అందజేశారు. స్థానిక హనుమంతరాయ గ్రంథాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు మంచి మనసుతో ఒక మంచి సంప్రదాయానికి పూనుకున్నారని ఓబులేసు అన్నారు. బుడమేరు పొంగి విజయవాడను ముంచెత్తిందని, సర్వం కోల్పోయిన పేదలకు ఉద్యోగులు తోడుగా నిలవడం హర్షణీయమన్నారు. తన వంతు కర్తవ్యంగా ప్రభుత్వం చేసిన సహాయం సరిపోలేదని, వివిధ సంఘాలు ముందుకు వచ్చి సాయం చేయడం స్వాగతించదగ్గదని ఓబులేసు అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం నాయకులు బీవీవీ కొండలరావు, ఎల్లారావు, జగన్‌మోహన్‌రావు, వీరారెడ్డి, సాంబశివరావు, నారాయణ రావు, రాజు, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్, పాక్ వైఖరి ఒకటే: రక్షణ మంత్రి ఖవాజా

ఇస్లామాబాద్: కశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ విషయంలో తమ దేశంలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం, భారత్‌లోని కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి ఒకే వైఖరితో ఉన్నాయని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ పేర్కొన్నారు. ఓవైపు జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పాక్‌లోని జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసీఫ్ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఎన్‌సీ కూటమి విజయం సాధించి అధికారం చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. 'ఆ కూటమి ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ పునరుద్ధరణను ఓ ఎన్నికల అంశంగా చేశాయి. ఈ విషయంలో వారిది, మా వైఖరి ఒకేలా ఉంది' అని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని ఓ పక్క నేషనల్‌కాన్ఫరెన్స్ చెబుతుండగా... కాంగ్రెస్ పార్టీ మాత్రం మౌనం పాటిస్తోంది. కనీసం వాటి మేనిఫెస్టోలో ఈ అంశాన్ని ప్రస్తావించలేదు. మరోవైపు పాక్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుడు అమిత్ మాలవీయ స్పందిస్తూ 'పాక్ ఓ ఉగ్రవాదదేశం. కశ్మీర్‌పై వైఖరి విషయంలో కాంగ్రెస్-ఎన్‌సీ కూటమికి మద్దతు ఇస్తోంది. ఇటు పాకిస్థాన్ నుంచి పన్ను వరకు, అటు రాహుల్ గాంధీ భారత్ ప్రయోజనాలకు ఎలా ఉంటున్నారో తెలియజేస్తోంది' అని వ్యాఖ్యానించారు.

కశ్మీరీ తొలి ముస్లిం ఐఏఎస్ కన్నుమూత

శ్రీనగర్: కశ్మీర్ నుంచి ఐఏఎస్ అయిన తొలి ముస్లిం మహమ్మద్ షఫీ పండిత్ (80) కన్నుమూశారు. కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన గతనెల రోజులుగా దిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం తుదిశ్వాస విడిచారు. షఫీ పండిత్ మరణాన్ని కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. 1969లో సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన కశ్మీర్‌కు చెందిన మొట్టమొదటి ముస్లిం అభ్యర్థిగా పండిత్ నిలిచారు. జమ్మూకశ్మీర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా పదవీ విరమణ పొందారు. జమ్మూకశ్మీర్ సీఎస్‌గా పండిత్‌ను వ్యవహరించేవారు కానీ జమ్మూకశ్మీర్‌కు సీఎస్ లేరు. షఫీ పండిట్ మరణానికి ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తదితరులు నివాళులర్పించారు. 'కశ్మీర్‌కు చెందిన తొలి తరం ఐఏఎస్ అధికారులలో ఒకరైన మహమ్మద్ షఫీ పండిత్ మరణించినట్లు దుర్వార్త అందింది. ఆయన కశ్మీర్‌కు గర్వకారణం. పదవీ విరమణ తర్వాత కూడా సమాజ సంక్షేమం కోసం పండిత్ పనిచేశారు. ఆయన మరణం బాధాకరం' అని కశ్మీర్ సభలో మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. జైరాం రమేశ్ 'ఎక్స్' మాధ్యమంగా మిత్రుడిని కోల్పోయినట్లు పేర్కొన్నారు. పండిత్‌తో తనది అనేక సంవత్సరాల అనుబంధంగా తెలిపారు. పదవీ విరమణ తర్వాత ప్రజాసేవకు జీవితాన్ని అంకితమిచ్చారన్నారు. పండిత్ మృదుభాషి, సౌమ్యుడని, యువతకు స్ఫూర్తిప్రదాతని జైరాం రమేశ్ ప్రశంసించారు.

పట్టాలపై ఇనుప స్తంభం

డెహ్రాడూన్: ఇటీవల కాలంలో రైలు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. పట్టాలపై పొడవైన ఇనుప స్తంభాన్ని అడ్డంగా పెట్టి రైలు ప్రమాదానికి దుండగులు యత్నించారు. అయితే లోకో పైలట్ అప్రమత్తంగా ఉండటం, సకాలంలో స్పందించడంతో ఘోరం తప్పింది. కడ్డీని గమనించిన ఆయన రైలు ఆపి, దానిని తొలగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన 18వ తేదీ రాత్రి 10.18 గంటలకు ఉత్తరప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ రోడ్, ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్ సిటీ మధ్య రైలు మార్గంలోని 43/10-11 కిలోమీటరు వద్ద జరిగింది. పట్టాలపై 6 మీటర్ల పొడవైన ఇనుప స్తంభాన్ని డ్రైవర్ గుర్తించారు. రైలు నంబర్ 12091 లోకో పైలట్ వెంటనే రైలు ఆపి పట్టాలపై ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఆ రైలును సురక్షితంగా నడిపిన లోకో ఫైలెట్...రుద్రపూర్ సిటీ స్టేషన్ మాస్టర్‌కు దీని గురించి నివేదించినట్లు చెప్పారు.

సీపీఐ సీనియర్ కార్యకర్త మురళి ఆకస్మిక మృతి



విశాలాంధ్ర-విజయవాడ: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ కార్యకర్త కేమిశెట్టి మురళి (70) గురువారం మృతి చెందారు. ఆయన యుక్త వయసు నుంచి సీపీఐ కృష్ణా జిల్లా కార్యాలయం పామిదత్ భవన్ కేంద్రంగా 1970-90 వరకు నాయకత్వ బాధ్యతల్లో ఉన్న అమరజీవులు జేఎస్ఆర్ ఆంజనేయ శాస్త్రి, తమ్మిన పోతరాజు, దాసరి నాగభూషణరావు, కొల్లి నాగేశ్వరరావు, లంకా గోవింద రాజులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ వంటి అనేక మంది నాయకుల వద్ద సహాయకుడుగా ఉండే వారు. వివాహం చేసుకోకుండా ఒంటరిగా వాంబే కాలనిలో నివాసిస్తున్నారు. వయస్సు రీత్యా అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నగరంలో వామపక్ష పార్టీలు నిర్వహించే అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బాధ్యతలు నిర్వహించే సమయంలో పార్లమెంట్, అసెంబ్లీ, పంచాయితీ, మున్సిపల్ కార్పొరేషన్ ఇలా ఏ ఎన్నికలైనా, పార్టీ, ప్రజాసంఘాల జాతీయ, రాష్ట్ర, జిల్లా మహాసభల సమయంలో రాత్రింబవళ్లు అహర్నిశలు క్రమశిక్షణతో శ్రమించేవారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులకు అవసరమైన సమాచారం అందజేయడం, సహకారం అందజేయడం ద్వారా అందరి మన్ననలు పొందారు. నాటి పార్టీ జిల్లా నాయకత్వం దోనేపూడి దత్తు, మోదుమూడి శ్రీహరిరావు, బొడ్డు దేవసుందరం, వెల్లంకి సుబ్బారావు, గుజ్జుల సరళాదేవి, చంద్ర రాజకుమారి, చలసాని జగన్నాథరావు, జల్లి విల్సన్, కె. సుబ్బరాజు, కె శేఖర్‌బాబు, చలసాని రత్నకుమారి, పర్వతనేని కిశోర్, వెలగపూడి ఆజాద్, అక్కినేని చంద్రరావు, దేవభక్తుని నిర్మల తదితరు లకు జిల్లా పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణ బాధ్యతలు నిర్వర్తించే సమయంలో పామిదత్ భవన్‌లో ఉన్నప్పుడు అవసరమైన సేవలు మురళి ద్వారా పొందారు. దుర్గాఅగ్రహారంలో మురళి కుటుంబం నివసించే సమయంలో తల్లి, తమ్ముడు మృతిచెందినప్పుడు నాటి పార్టీ నాయకత్వం చొరవతీసుకుని వారి అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించింది. ఒంటరిగా నివసించే మురళికి పార్టీ, ప్రజాసంఘాలకు చెందిన వారు కడవరకు అండగా నిలిచారు. నగరంలో పార్టీ, ప్రజాసంఘాలు నిర్వహించే కార్యక్రమంలో నేను సెతం అంటూ ఉండే క్రమశిక్షణ, నిబద్దత ఉన్న వ్యక్తి మురళి. ఖాళీగా ఉన్న సమయంలో హనుమంత రాయ గ్రంథాలయం వద్దనే ఉంటూ సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే వారు. ఇటీవల వచ్చిన భారీ వర్షాలు, వరదల వల్ల ఇల్లు మునిగిపోవడంతో పటమటలో ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు పొట్లూరి రాఘవేంద్రరావు ఇంటి వద్ద ఉంటున్నారు. రెండు రోజుల క్రితం స్వల్ప అనారోగ్యానికి గురైన మురళి గురువారం మరణించారు. విషయం తెలిసిన వెంటనే సీపీఐ నాయకులు చొరవ చూపి అంత్యక్రియలు నిర్వహించారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు తొలుత మురళీ భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి నివాళులు అర్పించారు. నిబద్ధత కల్గిన మంచి కార్యకర్తను కోల్పోయామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, టీ లక్ష్మీనారాయణ ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్, హనుమంతరాయ గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆర్‌వీ. సత్యనారాయణ రాజు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎం. రామారావు, విశాలాంధ్ర న్యూస్ ఎడిటర్ మోదుమూడి మురళీకృష్ణ సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు మురళి మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

జల్లి విల్సన్ దిగ్భ్రాంతి

సీపీఐ సీనియర్ కార్యకర్త మురళి ఆకస్మిక మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ప్రగాఢ సంతాపం తెలిపారు. అంకితభావం, పార్టీ పట్ల విధేయత, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను సీపీఐ కోల్పోయిందన్నారు. పార్టీ కార్యాలయంలో బాధ్యతలు ఎంతో నిబద్ధతతో నిర్వహించే వారన్నారు. తాను పామిదత్ భవన్ కార్యదర్శిగా పనిచేసినప్పుడు 1973 నుంచి 1982 వరకు తన సహాయకుడిగా పనిచేసిన సందర్భంలో మురళి నాయకులు, కార్యాలయానికి వచ్చిన వారికి అందించిన అద్భుత సేవలను ఈ సందర్భంగా విల్సన్ గుర్తుచేసుకున్నారు. మురళి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటుగా పేర్కొన్నారు.

ఆదుకున్న అశ్విన్, జడ్డూ

బంగ్లాతో తొలిటెస్టు...

టీమిండియా స్కోరు: 339/6

చెన్నై: భారత్ - బంగ్లాదేశ్ క్రికెట్ జట్ల మధ్య గురువారం ప్రారంభమైన తొలి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా ఆల్‌రౌండర్ శతకం (102 పరుగులు)తో అదరగొట్టాడు. 108 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇందులో 10 ఫోర్లు, 2 సిక్సలు ఉన్నాయి. దీంతో అశ్విన్ తన టెస్టు కెరీర్‌లో 6వ శతకం పూర్తి చేశాడు. మరోవైపు జడేజా (86 పరుగులు; 10×4, 2×6) కూడా బాధ్యాతాయుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఇక తొలి రోజు ఆట ముగిసేసరికి భారత్ 339-6 (80 ఓవర్లు) స్కోర్‌తో పటిష్ఠ స్థితికి చేరుకుంది. క్రీజులో అశ్విన్, జడేజా ఉన్నారు. ఒక దశలో 144 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియాను జడేజా, అశ్విన్ ఆదుకున్నారు. స్కోర్ 200 అయినా దాటుతుందా అన్న దశలో నుంచి భారత్‌కు 300+ స్కోర్ అందించారు. వీరిద్దరూ 7వ వికెట్‌కు ఏకంగా 195 పరుగులు అజేయ భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌కు భారీ స్కోర్ అందించారు. రోహిత్, గిల్, విరాట్ లాంటి స్టార్లు ఈ పిచ్‌పై పరుగులు చేయడానికి కష్టపడితే ఈ ఆల్‌రౌండర్లు భారీ స్కోర్లతో బంగ్లా బౌలర్లకు ఎదురు నిలిచారు. ఎలాంటి ప్రయోగాత్మక షాట్లకు పోకుండా నిలకడగా ఆడారు. ఈ క్రమంలోనే అశ్విన్ శతకం పూర్తి చేశాడు. కాగా, తన సొంత మైదానం చెపాక్‌లో అశ్విన్‌కు ఇది రెండో టెస్టు సెంచరీ.

టాపార్డర్ వైఫల్యం

ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన కెప్టెన్ రోహిత్ శర్మ (6), విరాట్ కోహ్లీ (6) విఫలమయ్యారు. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (0) పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ ముగ్గురిని 24ఏళ్ల బంగ్లా పేసర్ మహ్మద్ హసన్ ఔట్ చేశాడు. దీంతో భారత్ 34 పరుగులకే టాపార్డర్ కుప్పకూలింది. ఈ దశలో ఓపెనర్ యశస్వీ జైశ్వాల్ (56 పరుగులు) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రిషబ్ పంత్ (39 పరుగులు)తో కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఇక కేఎల్ రాహుల్ (16 పరుగులు) కూడా విఫలమయ్యాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహ్మద్ 4, నహీద్ రానా, మెహెదీ హసన్ మిరాజ్ తలో వికెట్ దక్కించుకున్నారు.

భారత్ జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్.

బంగ్లాదేశ్ జట్టు: నజ్ముల్ హసన్ శాంటో (కెప్టెన్), షద్మాన్ ఇస్లాం, జకీర్ హసన్, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్ అల్ హసన్, లిటన్ దాస్ (వికెట్ కీపర్), మెహిదీ హసన్ మిరాజ్, నహిద్ రాణా, హసన్ మహమూద్, తస్కిన్ అహ్మద్.

వరద బాధితులకు 'అదాని' సాయం రూ.25 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో వరద బాధితుల సహాయానికి అదానీ గ్రూపు ముందుకు వచ్చింది. రూ.25 కోట్ల భారీ సాయాన్ని ప్రకటిం చింది. ఈ మేరకు గౌతమ్ ఆదానీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. అపార నష్టం చవిచూసిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబును గురువారం అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదాని కలిసి చెక్కు అందజేశారు. దీనికి సంబంధించిన ఫొటోను గౌతమ్ అదానీ షేర్ చేశారు. చంద్రబాబు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వరద బీభత్సంతో కుదేలైన ప్రజల జీవితాలను మళ్లీ నిలబెట్టడానికి అదానీ గ్రూపు సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చంద్రబాబు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలపై ఉన్నత స్థాయి కమిటీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పారిశ్రామిక భద్రతను పెంపొందించే చర్యలను సూచించడానికి అమరావతి వెలగపూడి సచివాలయంలో గురువారం ఉన్నత స్థాయి కమిటీ సమావేశమైంది. పారిశ్రామిక ప్రమాదాల నివారణ చర్యలను సూచించడానికి ఇటీవల ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వసుధా మిశ్రా నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ వేసింది. వసుధా అధ్యక్షతన జరిగిన తొలి సమావేశానికి అటవీ, హోం, అగ్నిమాపక తదితర శాఖల ఉన్నతాధికారులు జీ అనంతరాము, ఎంఎం నాయక్, జీ విజయకుమార్, కేఎం అభిషేక్, డాక్టర్ పీ ప్రసాదరావు, డీ మురళీ మోహన్, బీ ఉమామహేశ్వరరావు, డీ చంద్రశేఖర వర్మ హాజరయ్యారు. కమిటీ సూచించిన నిబంధనలను వివరంగా చర్చించారు. కమిటీకి అప్పగించిన పనిని గడువులోగా పూర్తి చేయడానికి అనుసరించాల్సిన పద్ధతిని వివరించారు. అనకాపల్లి జిల్లాలో ఇటీవల ప్రమాదాలు జరిగిన కర్మాగారాల స్థల సందర్శనకు వచ్చే వారంలో కమిటీ ప్రతిపాదించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని ఇతర ఫ్యాక్టరీలను సందర్శించి పారిశ్రామిక భద్రత స్థితిగతులను అంచనా వేయాలని సూచన చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com